BALA CHELIMI

BALA

OCT 2026

OCT



PRGI Regn. No. 52828/1992

₹40

అక్టోబర్ - 2026

# బాల చెలిమి

పిల్లల వికాస పత్రిక

# BALA CHELIMI

Telugu Children's Monthly Magazine

సంపుటి : 36 • సంచిక : 1




OCTOBER - 2026

Editor : **Er. VEDAKUMAR MANIKONDA**

A PUBLICATION OF **CHILDREN'S EDUCATIONAL ACADEMY,** HYDERABAD, TELANGANA







## OCTOBER 2026

**Naib Subedar Gyan (Quartermaster) and Havildar Satender Bhadoria (Training NCO) of 3 Telangana Battalion NCC selected the 2nd NCC Batch of Oxford Grammar School. Senior cadets also honed their skills through firing practice at the NCC Firing Site.**


Oxford
Grammar High School

#Street No. 13, Himayathnagar, Hyderabad
Ph : 040 2763 6214, +91 99590 20512
www.oxfordgrammarschool.com


ogs
FOUNDATIONAL STAGE
- grow naturally -

45
YEARS OF
MERITORIOUS
PERFORMANCE

| Sun | Mon | Tue | Wed | Thu | Fri | Sat |
|---|---|---|---|---|---|---|
| | | | | 1 | 2 | 3 |
| 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 |
| 11 | 12 | 13 | 14 | 15 | 16 | 17 |
| 18 | 19 | 20 | 21 | 22 | 23 | 24 |
| 25 | 26 | 27 | 28 | 29 | 30 | 31 |
| | | | | | | |

**Important Dates**

2 Oct - Gandhi Jayanti
19 Oct - Durga Ashtami
20 Oct - Vijayadashami / Dussehra

NOTES :


Printed at : Deccan Press, Azamabad, Hyderabad. Ph.:+91 90599 50055



**Leaders aren't born, they are made through hard work.**


Printed at : Deccan Press, Azamabad, Hyderabad-20, Ph : 90599 50055

# బాలచెలిమి

పిల్లల వికాస పత్రిక

| సంపుటి: Volume: 36 | సంచిక : Issue : 1 | హైదరాబాద్ Hyderabad | అక్టోబర్ October | పేజీలు Pages 52 | రూ. ₹. 40 |
|---|---|---|---|---|---|











లోపలి పేజీల్లో.......




ఆనందాన్నిచ్చే బాల్యం ప్రతి చిన్నారి హక్కు... ........ మణికొండ వేదకుమార్ .. ........ 5
పరిమిత వనరులతోనే అత్యున్నత పరిశోధనలు చేసిన ఖగోళ భౌతిక శాస్త్రవేత్త మేఘనాథ్ సాహా (సైంటిస్ట్) జుగాష్‌విలి ........ 6
మా ఇల్లంటే మాకిష్టం (ప్రపంచ ఆవాస దినోత్సవం) ........ డా. నీరజ అమరవాది ........ 7
తెలివి ఏలిక (పాట)... ........ రేడియమ్........ 8
సిస్టర్ యం. సిరిల్ మూనీ........ షిరోన్-256 ........ 9
మాటకు ముందు అక్షరం చేర్చు... (అక్షరం) ........ చొక్కాపు వెంకటరమణ........ 10
నీతు చెట్టు (కథ)........ ఎస్. రక్షిత ........ 11
సుర్రు.. గుర్రు.. (పాట)... ........ గంగదేవు యాదయ్య ........ 12
ఉపాయం (కథ)........ ఎన్నవెల్లి రాజమౌళి ........ 13
రైళ్ళ పోటీ (ఆట).. ........ చిన్ననాటి ఆటలు - జ్ఞాపకాల మూటలు .. 14
రాకాశిలోయ - రత్నాలదీవి - 1 (సీరియల్)........ కూచిమంచి నాగేంద్ర........ 15
పదాల మేడ-5 (ఫజిల్)........ మాదారపు వాణిశ్రీ........ 16
పైలెట్ చూపును మెరుగుపరిచే శుభ వెంకటేశ అయ్యంగార్ 'దృష్టి' టెక్నాలజీ (సైన్స్ వెన్నెల-24) డా. నాగసూరి వేణుగోపాల్........ 17
పేరాశ, లోభితనమూ హానికరం.. ........ పంచతంత్ర కథ........ 18
తెలంగాణ చారిత్రక పర్యాటకం ఇక్ష్వాకుల కాలంలో దేవాలయాలు ........ దేశరాజు శ్యాంసుందర్‌రావు - స్థపతి...... 19
బరువు మారిందా? (సైన్స్)........ డాక్టర్ మహీధర నళినీ మోహన్........ 20
బాల గాంధీ (లఘునాటిక)........ డా. సమ్మెట విజయ........ 21
మరికొన్ని రకాల ధాన్యాలు ........ 'ఆరోగ్యం-విజ్ఞానం' పుస్తకం నుండి.. ...... 24
అశోక చెట్టు (చెట్టు - చేమ)........ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి ........ 25
అపార్థం (కార్టూన్)........ జుగాష్ విలి ........ 26
భారత యువ షూటర్ల విజయభేరి (స్పోర్ట్స్)........ బాలచెలిమి డెస్క్........ 28
తెలంగాణ సారస్వత పరిషత్తు బాలల సాంస్కృతికోత్సవం........ తె.సా.ప. ........ 28
జింక కుందేలు (కథ)........ అస్మిత ........ 29
సృజనాత్మకమైన పనులు అభివృద్ధి ........ శ్రీమతి మీనాస్వామినాథన్ ........ 30
మేలు మరవని పిచుక (అనువాద కథ) ........ అనిల్ బత్తుల ........ 31
రాము నేర్చుకున్న పాఠం (కథ) ........ ఎ. నవనీత్ గౌడ్........ 33
భారతదేశ యాత్రలో హ్యూయాన్ సాంగ్‌ను కదలించిన దృశ్యం (చరిత్ర కథలు-4)... . బాల కథా సౌరభం ........ 34

వేయిన్నర ఏండ్ల కిందటి సామాజిక పరిస్థితులు (చరిత్ర పాఠాలు-19) .................. డా. ద్యావనపల్లి సత్యనారాయణ .......... 35
నేర్చుకుందామా............................................................................................ 36
కలం-చెలిమి ..................................................................................................... 36
పిచుకమ్మ గూడు నా బుజ్జి నేస్తం (కథ) ........................................ కె. మోక్షిత.......................... 37
ముందుగా జవాబు 3 (మాథ్స్ ట్రిక్స్) .............................................. అంకెల మామయ్య చంద్రయ్య.............. 38
చెలిమి క్లబ్.................................................................................. బాలచెలిమి డెస్క్......................... 38
స్మార్ట్ వైద్యం-సురక్షిత ఆరోగ్యం (విద్య) .......................................... లత ........................................ 39
ఉదయించే కిరణాలు (పాట)... ........................................................ దేవులపల్లి సారిక రమేశ్ .................. 40
చీమ మరియు పావురం (పిల్లల కథల్లో సైన్స్-9)............................... కె శ్రీకృష్ణ సాయి ............................ 41
సామెతలు .................................................................................... బాలచెలిమి డెస్క్......................... 42
తెలంగాణ నదీ వ్యవస్థ - ప్రధాన ప్రాజెక్టులు (జి. కె.) ................... బాలచెలిమి డెస్క్......................... 43
వేమన పద్యం ................................................................................ వేమన విజ్ఞాన కేంద్రం .................. 44
బద్ధకం వదులు హుషారుగా ఉండు (కథ).......................................... ఎం. పాన్య నిధున......................... 45
పిగ్మీ హాగ్ - ప్రపంచంలోనే అతి చిన్న అడవి పంది (నేచర్) ................. సచిన్ కోత్వాల్............................. 46
సింహం - ఏనుగు (కథ)................................................................... చిందం అన్నపూర్ణ ......................... 47
బాలచెలిమి గ్రంథాలయం - పఠనాసక్తికి కొత్త వెలుగు ........................ నల్లగొండ సురేష్ ........................... 48
సమాచారం .................................................................................... బాలచెలిమి డెస్క్......................... 49
బాలచెలిమి జాతీయ స్థాయి పిల్లల కథల పోటీ - 2026 ...................... బాలచెలిమి డెస్క్......................... 49
పాత్ర చిన్నదైనా... నటన మహోన్నతం గుమ్మడి వెంకటేశ్వరరావు (వ్యక్తిత్వం) .......... సువేగా.................................... 50


# చెలిమి లేఖలు

బాలచెలిమి మాసపత్రికను చదువుతున్నప్పుడు ఎంతో ఆనందం, ఆశ్చర్యం కలిగాయి. ఇందులోని ఆసక్తికరమైన అంశాలు, అందమైన కథలు, విజ్ఞానదాయకమైన సమాచారం ఇతర పత్రికల్లో చాలా అరుదుగా కనిపిస్తాయి. నేటి సామాజిక పరిస్థితుల్లో బాలలలో పఠనాసక్తిని పెంపొందిస్తూ, వారి ప్రతిభకు, సృజనాత్మకతకు పదును పెట్టే దిశగా బాలచెలిమి చేస్తున్న కృషి ఎంతో అభినందనీయం.

మొదటిసారిగా ఈ మాసపత్రిక సాఫ్ట్‌కాపీని చూసిన వెంటనే ఎంతగానో ఆకర్షితుడినయ్యాను. బాలలకు ఇంత వైవిధ్యమైన, విలువైన విషయాలను అందిస్తున్న పత్రిక మరొకటి నాకు కనిపించలేదు. అందుకే వెంటనే బాలచెలిమి మాసపత్రికకు చందాదారుడిగా చేరాను. ఈ పత్రికను నాకు తెలిసిన మిత్రులు, శ్రేయోభిలాషులు, ఉపాధ్యాయులు, విద్యార్థులకు చేరువ చేయడానికి నా వంతు కృషి చేస్తాను.

బాలల పత్రికను అందుబాటులోకి తీసుకొచ్చిన సంపాదకులు శ్రీ మణికొండ వేదకుమార్ గారికి, బాలచెలిమి బృందానికి నా హృదయపూర్వక అభినందనలు, ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

- బి.ఎస్. రమణారెడ్డి
ఉషాకిరణ్ హైస్కూల్, వేంపల్లి
కడప జిల్లా, ఆంధ్రప్రదేశ్

*Cover Picture :*
THE MAGIC OF PUPPETRY
OGS Students Perform
(Spoorthi Theatre )

బొమ్మలు:
కూరెళ్ల శ్రీనివాస్,
m : 98495 43728





సంపాదకులు : మణికొండ వేదకుమార్

BALA CHELIMI
"CHANDRAM" 3-6-712/2, St. No. 12,
Himayatnagar, Hyderabad - 500 029.
e-mail : edit. chelimi@gmail. com, www. balachelimi. com
Mob: 98480 44713

# ఆనందాన్నిచ్చే బాల్యం ప్రతి చిన్నారి హక్కు




పిల్లలకు నవ్వడం, పరుగెత్తడం, గెంతడం, ఆడుకోవడం, బొమ్మలు గీయడం, పాటలు పాడడం, నృత్యం చేయడం ఎంతో ఇష్టం. వానలో తడవడం, నీటితో ఆడుకోవడం, మట్టిలో పొర్లటం, తమకంటూ కొత్త ఆటలు సృష్టించుకోవడం, వాటిని ఆస్వాదించడం వారికి ఎంతో ఆనందం ఇస్తాయి. కుతూహలం, ఊహాశక్తి, అమాయకత్వం, అపారమైన ఉత్సాహంతో నిండిన అద్భుత ప్రపంచం బాల్యం. ప్రతి చిన్నారికీ ఈ అనుభూతిని స్వేచ్ఛగా, సంపూర్ణంగా ఆస్వాదించే సమయం, అవకాశం ఉండాలి.

అయితే, ఇప్పుడు మనం బాల్యాన్ని మార్కులు, ర్యాంకులు, పరీక్షలు, విజయాల ఆధారంగా కొలవడానికి అలవాటుపడ్డాం. విద్య ఎంతో అవసరం. కానీ తరగతి గదులు, పాఠ్యపుస్తకాలు, పరీక్షలకే పిల్లల జీవితాన్ని పరిమితం చేయలేం. వారికి కొంత సమయం కేవలం పిల్లలుగా ఉండటానికి కూడా కావాలి.

ఆటస్థలం పుస్తకాలు నేర్పలేని ఎన్నో విషయాలను నేర్పుతుంది. తోటి వారితో కలిసి ఆడుతూ పిల్లలు స్నేహం, సహకారం, సహనం, గెలుపు-ఓటములను సమానంగా స్వీకరించడం నేర్చుకుంటారు. చిత్రలేఖనం ఊహలకు రూపం ఇస్తుంది. పాటలు, నృత్యం వంటి లలిత కళలు భావవ్యక్తీకరణకు దోహదపడతాయి. మట్టి, నీరు, ప్రకృతితో అనుబంధం వారికి పరిసర ప్రపంచాన్ని అర్థం చేసుకుని ప్రేమించేలా చేస్తుంది.

పిల్లల ఎదుగుదలలో నాటకానికి ప్రత్యేక స్థానం ఉంది. సాధన నుంచి ప్రదర్శన వరకు వారు చదవడం, వినడం, గుర్తుంచుకోవడం, మాట్లాడడం, కదలడం, భావాలను వ్యక్తపరచడం నేర్చుకుంటారు. భాషపై పట్టు, సమయపాలన, క్రమశిక్షణ పెంపొందుతాయి. ప్రతి ఒక్కరి కృషి కలిసినప్పుడే బృంద విజయం సాధ్యమని వారు గ్రహిస్తారు.

సాధనలో తప్పులు చేస్తారు, నవ్వుకుంటారు, మళ్లీ ప్రయత్నిస్తారు, మెరుగుపడతారు. ఆ తర్వాత వస్తుంది ఆ మధురమైన క్షణం - వేదికపై నిలబడటం. ప్రేక్షకుల ముందు సంభాషణలు చెప్పడం, పాత్రను పోషించడం ద్వారా సంకోచం, వేదిక భయం క్రమంగా తొలగిపోతాయి. తెరపడినప్పుడు మారుమోగే చప్పట్ల మధ్య వారి ముఖాల్లో కనిపించే ఆనందం ఒక్క మాటలో వ్యక్తమవుతుంది: “నేను సాధించాను!”

ఆ అనుభూతి ఆత్మవిశ్వాసంగా మారి, వేదిక దాటి వారి జీవితమంతా వెంట నడుస్తుంది. తెలియకుండానే జీవితానికి అవసరమైన పాఠాలను నేర్చుకున్నవారవుతారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పెద్దలుగా మన బాధ్యత పిల్లలను పరీక్షలకు సిద్ధం చేయడానికే పరిమితం కాదు; కళలు, నాటకం, సాహిత్యం, సంగీతం, ప్రకృతి, స్నేహం, స్వేచ్ఛ, ఆటలకు వారిని దగ్గర చేయాలి.

**వారి ప్రతి క్షణాన్నీ ఆదేశాలు, అంచనాలతో నింపకండి.**
**వారు హాయిగా నవ్వనివ్వండి.**
**పాటలు పాడుతూ, నృత్యం చేస్తూ ఆనందించనివ్వండి.**
**తమ కలలకు చిత్రరూపం ఇవ్వనివ్వండి.**
**వానలో పరుగెత్తి, నేలను తాకనివ్వండి.**
**ఆడనివ్వండి, నటించనివ్వండి, ఊహించనివ్వండి, సృష్టించనివ్వండి.**

బాల్యం జీవితం కోసం చేసే సన్నాహకం మాత్రమే కాదు.
బాల్యమే జీవితం. దాన్ని ఆనందంగా జీవించే హక్కు ప్రతి చిన్నారికీ ఉంది.





మీ
వేదకుమార్.యం
(మణికొండ వేదకుమార్)
ఎడిటర్ బాలచెలిమి

సైంటిస్ట్

# పరిమిత వనరులతోనే అత్యున్నత పరిశోధనలు చేసిన ఖగోళ భౌతిక శాస్త్రవేత్త మేఘనాథ్ సాహా

మేఘనాథ్ సాహా 1893 అక్టోబర్ 6న ప్రస్తుత బంగ్లాదేశ్‌లోని షియోరాతలి అనే చిన్న గ్రామంలో జన్మించారు. ఆర్థిక పరిస్థితి సహకరించకపోయినా చదువు పట్ల మేఘనాథ్‌కు వున్న ఆసక్తిని గమనించిన తల్లిదండ్రులు అతన్ని ప్రోత్సహించారు. 1905లో ప్రసిద్ధ ఢాకా కాలేజియేట్ స్కూల్లో ప్రవేశం పొందాడు. ప్రవేశ పరీక్షలో చూపిన ప్రతిభ వల్ల స్కాలర్‌షిప్ లభించింది. బెంగాల్ విభజన వ్యతిరేక నిరసన కార్యక్రమంలో పాల్గొన్నందుకు స్కాలర్‌షిప్ రద్దయింది. ఆ స్కూల్‌ను కూడా విడిచి పెట్టవలసి వచ్చింది.



కోల్‌కతాలోని ప్రెసిడెన్సీ కళాశాల నుంచి గణితశాస్త్రం ప్రధానాంశంగా పట్టభద్రులయ్యారు. సత్యేంద్రనాథ్ బోస్, ప్రశాంత చంద్ర వంటి ప్రతిభావంతులు అతని సహ విద్యార్థులు. ప్రముఖ శాస్త్రవేత్తలు జగదీష్ చంద్రబోస్, ప్రఫుల్ల చంద్రవంటి వారి బోధన, పరిశోధనలు మేఘనాథ్‌ను ప్రభావితం చేసాయి.

నక్షత్రాలు ఏ పదార్థాలతో ఏర్పడ్డాయి? వాటిలో ఏయే మూలకాలు ఉన్నాయి? నక్షత్రాల ఉష్ణోగ్రతలను ఎలా తెలుసుకోవాలనే ప్రశ్నలకు మేఘనాథ్ సాహా శాస్త్రీయమైన వివరణ యిచ్చారు. అధిక ఉష్ణోగ్రతల వద్ద మూలకాల పరమాణువులు తమ ఎలక్ట్రానులను కోల్పోయి అయనీకరణం చెందుతాయని వివరించారు. ఉష్ణోగ్రత పీడనం మారినప్పుడు అయనీకరణ స్థాయి కూడా మారుతుందని గణితపూర్వకంగా నిరూపించారు. దీనినే 'సాహా అయనీకరణ సమీకరణం' అంటారు. ఈ సమీకరణం సహాయంతో నక్షత్రాల వర్ణపటంలో కనిపించే రేఖలను విశ్లేషించి, వాటి ఉపరితల ఉష్ణోగ్రతలు, పీడనం, రసాయనిక స్వభావాన్ని తెలుసుకునే అవకాశం ఏర్పడింది. నక్షత్రాలు భూమికి కోట్ల కిలోమీటర్ల దూరంలో ఉన్నప్పటికీ, వాటి నుంచి వచ్చే కాంతిని పరిశీలించి అక్కడి పరిస్థితులను అంచనా వేయవచ్చునని సాహా పరిశోధనలు నిరూపించాయి. ఆ ఆవిష్కరణ ఆధునిక ఖగోళ శాస్త్ర అభివృద్ధిలో ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది. ఉన్నత పరిశోధనల కోసం ఇంగ్లండ్, జర్మనీ వెళ్లారు. విదేశాల్లో లభించిన అవకాశాలను తన వ్యక్తిగత అభివృద్ధికి పరిమితం చేయకుండా భారతదేశంలో శాస్త్ర పరిశోధనలను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో పని చేసారు. శాస్త్రవేత్తల మధ్య సహకారం, పరిశోధనా ఫలితాల మార్పిడి అవసరమని ఆయన నమ్మారు. అలహాబాద్‌లో 'అకాడమీ ఆఫ్ సైన్సెస్' స్థాపనకు కృషి చేసారు. ఇప్పుడది 'నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్, ఇండియా' గా ప్రసిద్ధి చెందింది. 1947లో ఆయన 'ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూక్లియర్ ఫిజిక్స్' స్థాపనకు నాయకత్వం వహించారు. తరవాత ఆయన గౌరవార్థం దానికి 'సాహా ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూక్లియర్ ఫిజిక్స్' అని పేరు పెట్టారు. శాస్త్ర విజ్ఞానం ప్రజల జీవితాలను మెరుగుపరచడానికి ఉపయోగపడాలని భావించారు. దేశ ఆర్థిక ప్రణాళికలో శాస్త్రవేత్తలకు తగిన స్థానం ఉండాలని కోరుకున్నారు. 'సైన్స్ అండ్ కల్చర్' అనే శాస్త్ర విజ్ఞాన పత్రిక స్థాపనలో ముఖ్య పాత్ర పోషించారు. దేశ విధానాల రూపకల్పనలో ప్రత్యేక్షంగా పాల్గొనాలన్న ఉద్దేశంతో పార్లమెంటుకు ఎన్నికయ్యారు. పేదరికం, అవకాశాల కొరత, రాజకీయ ఆటంకాలు తన లక్ష్యాలకు అడ్డు కాదని నిరూపించారు. భారతీయ శాస్త్ర విజ్ఞానానికి కొత్త దిశను చూపిన మేఘనాథ్ సాహా 1956 ఫిబ్రవరి 16న న్యూఢిల్లీలో మరణించారు.

– జుగాష్‌విలి
బాలచెలిమి డెస్క్, m : 83094 52998

# మా ఇల్లంటే మాకిష్టం



పిల్లలూ మీకు బడి అంటే ఇష్టమా! ఇల్లంటే ఇష్టమా! ఆలోచిస్తున్నారా? ఎవరికైనా మొదట ఇల్లే. తరువాతే బడి, గుడి. ఇప్పుడు ఈ సందేహం ఎందుకు వచ్చిందని ఆలోచిస్తున్నారా. మనందరికి ముఖ్యమైనది, అవసరమైనది సురక్షితమైన ఆవాసం. రకరకాల కారణాల వల్ల సరైన నివాసానికి ఎన్నో కుటుంబాలు దూరమౌతున్నాయి. ఐక్యరాజ్యసమితి సర్వసభ్యసమావేశం (UN General Assembly) సురక్షితమైన ఆశ్రయం (safe shalter) అనేది ప్రతి మానవుడి ప్రాథనిక హక్కు అని తెలియజేయడానికి, ప్రపంచ పట్టణీకరణ(urbanization) సవాళ్ల పై దృష్టి పెట్టడానికి ప్రపంచ ఆవాసదినోత్సవం (World Habital day) ని జరుపుకోవాలని సూచించిది. 1986 నుండి ప్రతి సంవత్సరం అక్టోబర్ నెల మొదటి సోమవారం జరుపుకునే ఆవాసదినోత్సవంలో ప్రపంచవ్యాప్తంగా అనేక సంస్థలు, కార్యాలయాలు, విద్యాసంస్థలు కూడా పాల్గొంటున్నాయి.

"Housing is absolutely essential to human flourishing. without stable shelter, it all falls apart". - Mathew Desmond.

సురక్షితమైన నివాసం అంటే నివసించే వారికే కాక చుట్టుపక్కల వారికి కూడా సురక్షితంగా ఉండాలి. ఈ మధ్యే అనుమతి కన్నా ఎక్కువ అంతస్తులలో భవనాన్ని నిర్మించటం వల్ల, అది కూలిపోవడం వల్ల ఎంతో ప్రాణనష్టం జరిగింది. దానితో పాటు చుట్టు పక్కల ఉన్న అపార్ట్ మెంటులకి కూడా ఎంతో నష్టం జరిగిందని మనందరం మీడియా ద్వారా తెలుసుకున్నాము. అలాంటి సంఘటనలు ప్రపంచవ్యాప్తంగా ఎన్నో. వాటిని అరికట్టడానికి, ఆ విషయాలపై అవగాహన కలిగించడం ఈ ఆవాస దినోత్సవ ముఖ్య లక్ష్యం. గ్రామాలన్నీ పట్టణాలకు వలస రావడం వల్ల ఉపాధి, మంచి విద్య అందుబాటులోకి వచ్చింది. కాని దాని వల్ల ఊహించని రకరకాల సమస్యలు, పర్యావరణానికి హాని జరగడాన్ని గమనించారు. అందులోని భాగమే ప్రస్తుతం మనందరం చూస్తున్న అకాలవర్షాలు, అధిక ఉష్ణోగ్రతలు. హిమాలయ పర్వతాలు సైతం భూకంపాలకి, వరదల (Natural Disasters)కి కొట్టుకుపోతున్నాయి. అంటే మనం ఈ తరానికే కాక భవిష్యత్ తరాలకి కూడా ఎంతో హాని చేస్తున్నాము.

అందుకే పట్టణ అభివృద్ధి కూడా ఒక ప్రణాళిక ప్రకారం జరగాలి. సురక్షితమైన పట్టణాలని, నివాసాలను నిర్మించుకోవాలి. దీనితో పాటు అందరికీ తాగునీరు అందుబాటులో ఉండేట్లు చూడాలి. సరైన పారిశుద్ధ వ్యవస్థ ఉండేట్లు చూడాలి. లేకపోతే రోగాలను ఆహ్వానించినట్లే. ఇది అభివృద్ధి చెందుతున్న అన్ని దేశాలలోని పట్టణాలలోని

స్థితి. అందుకే పర్యావరణాన్ని కాపాడుతూ, భూమి పై అతి భారం పడకుండా కట్టడాలను నిర్మించాలని. పెను విపత్తులను తట్టుకునేట్లు నిర్మాణాలను చేపట్టాలను మేధావులందరు తమ తమ గళాన్ని వినిపించడానికి ఈ habital dayని ఉపయోగించుకుంటున్నారు. ప్రతి సంవత్సరం ఒక థీమ్‌తో ఈ ఉత్సవాన్ని జరుపుతారు. 2026 సంవత్సరానికి 'Adequate Housing for All' ని థీమ్‌గా తీసుకున్నారు. అందరికీ సురక్షితమైన నివాసం ఉండాలని భావిస్తున్నారు. ఇందులో భాగంగా పరిశుభ్రతకి, పచ్చదనానికి ప్రాధాన్యతను ఇచ్చారు. విపత్తుల గురించి తెలుసుకునే ముందస్తు హెచ్చరిక వ్యవస్థను నిర్మించుకోవాలి.

ఎందరో సరైన నివాసం లేని వారికి మంచి ఇళ్లను కట్టిస్తున్నారు. వారికి కావలసిన ఇతర అవసరాలు అంటే నాణ్యమైన విద్య, ఆరోగ్య సేవలను అందిస్తున్నారు. అటువంటి వారికి ప్రతి సంవత్సరం ఆవాసదినోత్సవంలో భాగంగా centre for UN human settlements (UNCHS) వాళ్లు ఎంతో ప్రతిష్ఠాత్మకమైన UN- Habital scoll of Honour Award ని ఇస్తారు.

ప్రపంచ ఆవాసదినోత్సవ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులందరు రకరకాల కార్యక్రమాలలో పాలు పంచుకోవాలి.

సమీపంలో ఉన్న పార్కులను, వీధులను, నదులను, కాలువలను శుభ్రం చేయాలి.

వీలైనంతగా ప్రజారవాణా వ్యవస్థని ఉపయోగించాలి.


చెట్లను నాటాలి. నాణ్యమైన జీవనానికి పర్యావరణ పరిరక్షణ పౌరులందరి బాధ్యత అని తెలుసుకోవాలి. 'నేటి బాలలే రేపటి పౌరులు' కనుక పిల్లలూ మీరంతా ఈ విషయాలను తెలుసుకొని, భవిష్యత్తులో పర్యావరణానికి హితం చేసే కార్యక్రమాలను చేపడుతారు కదా.

"On this occasion of World Habital Day, we must all remember our first and foremost duty to save the environmental beauty. Wish you a very happy Habital day".

– డా. నీరజ అమరవాది

m : 9849160055

# తెలివికి ఏలిక




లెక్కల టీచర్ వచ్చాడు
లెక్కలు ఎన్నో చెప్పాడు
లెక్కల చిక్కులు చూపాడు
లెక్కల గుట్టును విప్పాడు

అంకెలు సంఖ్యలు ఉంటాయి
సున్నానే ప్రాణం అంటాయి

లెక్కలు తేలిక
తెలివికి ఏలిక
సాగు ముందుకిక
భయం దేనికిక

మెదుడుకు పదును
చేయూతకు అదును
పట్టు పడితె సులువు
సంతోషానికి నెలవు

శాస్త్రాలన్నింటికి మూలం
ప్రశ్నలకు జవాబు ఖాయం

విశ్వమంతట
గణితమయం
గణితం తోనే
మానవ జయం

– రేడియమ్
m: 9291527757

# సిస్టర్ యం. సిరిల్ మూనీ

## సమ్మిళిత, నాణ్యమైన విద్యకు కొత్త దారులు

సిస్టర్ యం. సిరిల్ మూనీ (1936 జులై 21 - 2023 జూన్ 24) ఐర్లాండ్‌లో పుట్టిన క్రైస్తవ సన్యాసిని. అంకిత భావం కలిగిన సృజనాత్మక విద్యావేత్తగా, సహృదయ సామాజిక కార్యకర్తగా భారత దేశంపై చెరగని ముద్ర వేశారు.

సిస్టర్ యం. సిరిల్ చిన్న వయసులోనే హోలీ ఘోస్ట్ ఫాదర్స్ మిషనరీ సొసైటీ తరపున పత్రికలు పంపిణీ చేయడం ద్వారా సామాజిక సేవలో భాగం పంచుకున్నారు. ఆమె 1956 అక్టోబర్ 10న భారత దేశానికి వచ్చినప్పుడు పేద పిల్లల జీవితాలు మెరుగుపరచే జీవితకాల ప్రయాణాన్ని ఆరంభించారు. ఉత్తర్ ప్రదేశ్‌లోని లఖ్‌నవూ నుంచి జంతు శాస్త్రంలో డాక్టరేట్ పొందడం ఆధ్యాత్మిక, విద్యా విషయాల పట్ల ఆమె నిబద్ధతకు నిదర్శనం.




వెనకబడిన పిల్లలను ఎక్కువ సంఖ్యలో చేర్చుకునే ఉద్దేశంతో రెయిన్‌బో పాఠశాల కార్యక్రమాన్ని ఆమె ఆరంభించారు. ఇందులో 50 శాతం వరకు పేద పిల్లలే. సిస్టర్ యం. సిరిల్ అవిశ్రాంత కృషి ఆమెకు ఎంతో గుర్తింపు తెచ్చిపెట్టింది. 2007లో పద్మశ్రీ అవార్డు, నిరక్షరాస్యత మీద పోరాటం చేస్తున్న వ్యక్తి లేదా సంస్థకు యునెస్కో ఇచ్చే నోమా లిటరసీ అవార్డు ఆమె అందుకున్నారు.

2023 సంవత్సరంలో సిస్టర్ యం. సిరిల్ మూనీ చనిపోయారు. కరుణ, ప్రజ్ఞానాత్మకత, విద్యా సంస్కరణల వారసత్వాన్ని ఆమె మిగిల్చి వెళ్లారు. సమాజానికి ఆమె చేసిన గొప్ప కృషి భవిష్యత్ తరాలకు స్ఫూర్తి ఇస్తూనే ఉంటుంది. ఆమె స్పృశించిన, మార్చిన లెక్కలేనన్ని జీవితాలపై ఆమె ముద్ర కనిపిస్తూనే ఉంటుంది.

- 'షీరోస్-256 ఇన్‌స్పైరింగ్ వుమెన్ ఫ్రమ్ ఇండియా' నుండి....

### మీకు తెలుసా?

లోరెటో సిల్దాలో ఆమె ఒక కార్యక్రమాన్ని మొదలుపెట్టారు. ఇందులో సగం మంది బాలికలు పూర్తి ఫీజులు చెల్లిస్తారు, పశ్చిమ బెంగాల్ మురికివాడల నుంచి వచ్చిన మిగిలిన సగం మంది ఉచితంగా చదువుకుంటారు.

# అక్షరాలతో ఆటలు



## మాటకు ముందు ఒక అక్షరం చేర్చు...
## మరో కొత్త మాట వస్తుంది చూడు

| | | | |
|---|---|---|---|
| బడి | - రాబడి | నత్త | - మేనత్త |
| కీలు | - వకీలు | కారు | - పుకారు |
| రసం | - నీరసం | మాట | - టమాట |
| కుండ | - పోకుండ | రాగి | - బైరాగి |
| పాలు | - పాపాలు | రాణి | - పారాణి |
| కారం | - ఆకారం | కలి | - ఆకలి |
| గాలి | - ఆగాలి | గడి | - అంగడి |
| గ్రామం | - సంగ్రామం | యంత్రం | - సాయంత్రం |
| జారు | - బజారు | గంట | - జేగంట |



– చొక్కాపు వెంకటరమణ
రచయిత,
కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత
(తానా 'తెలుగు తేజం' పుస్తకం నుండి...)
m: 92465 20050

కథ

# నీతు చెట్టు



చాగల్లు అనే అందమైన ఊరిలో, పచ్చని చెట్లు, చెదిరిపోయే మేఘాల మధ్య ఒక చిన్న ఇల్లు ఉండేది. ఆ ఇంట్లో నీతూ అనే చిన్న పాప, తన తాతయ్యతో కలిసి ఉండేది. నీతూకి కుతూహలం ఎక్కువ! ఏది చూసినా, "ఇది ఏమిటి? అది ఎలా అయ్యింది?" అని అడిగేది.

ఒక రోజు, ఇంటి ముందు రోడ్డు మీద పిల్లలు ఆటలు ఆడుతుండగా, నీతూ కిటికీలోంచి చూసింది. ఆటల్లో మహేందర్ అనే అబ్బాయి చేతిలో తెల్లగా, గట్టిగా ఉన్న కొన్ని వస్తువులు కనిపించాయి. అవి గిర్రున తిరిగే బొంగరంలా ఉన్నాయి, కానీ లోపల ఏదో శబ్దం వస్తోంది! నీతూ ఆపుకోలేక, పరుగున బయటకు వెళ్లి, "మహేందర్, ఇవి ఏమిటి? నాకు రెండు ఇవ్వవా?" అని అడిగింది.

మహేందర్ నవ్వి, "సరే, తీసుకో!" అన్నాడు. నీతూ ఆ రెండు తెల్లని గట్టి వస్తువులను పట్టుకుని, ఇంట్లోకి పరుగెత్తింది. "తాతా! తాతా!" అంటూ పిలిచింది. తాతయ్య, తన పొడవాటి తెల్లని గడ్డంతో నవ్వుతూ వచ్చాడు. "ఏంటమ్మా, అంత ఉత్సాహం?" అని అడిగాడు.

నీతూ ఆ గట్టి వస్తువులను చూపిస్తూ, "తాతా, ఇవి ఏమిటి? లోపల ఏదో శబ్దం వస్తోంది!" అని అడిగింది. తాతయ్య చిన్నగా నవ్వి, "ఇవా? ఇవి మామిడి టెంకలు! మనం మామిడి పండ్లు తినేటప్పుడు లోపల ఉండే గట్టి గింజలు ఇవే. ఎండలో ఎండిపోయి ఇలా తెల్లగా అయ్యాయి," అని చెప్పాడు.

"తాతా, వీటితో ఏం చేయొచ్చు?" అని నీతూ కుతూహలంగా అడిగింది. తాతయ్య కళ్లలో ఓ చిలిపి చూపు! "పద, ఈ టెంకలను మన పెరట్లో నాటుదాం. ఒక రోజు ఇవి పెద్ద మామిడి చెట్టుగా మారతాయి!" అన్నాడు.

అలా, నీతూ, తాతయ్య కలిసి పెరట్లో ఒక మూలన ఆ టెంకలను నాటారు. నీతూ ప్రతి రోజూ ఉదయం లేచి, ఆ చిన్న గొయ్యిని చూడటానికి వెళ్లేది. "ఎప్పుడు మొలక వస్తుంది?" అని తాతను అడిగేది.

పది రోజుల తర్వాత, ఒక ఉదయం, ఆ గొయ్యి నుండి చిన్ని మొలక తొంగి చూస్తోంది! నీతూ సంతోషంతో గెంతులేసింది. "తాతా, మొలక వచ్చింది!" అని అరిచింది.

తాతయ్య ఆ మొలక చుట్టూ చిన్న కంచె వేసి, "నీతూ, ఈ చెట్టుకు నీవు నీళ్లు పోసి, చూసుకోవాలి. ఇది నీ చెట్టు!" అన్నాడు. నీతూ అలాగే చేసేది. ప్రతి రోజూ నీళ్లు పోసి, ఆ చిన్న మొలకతో మాట్లాడేది. "పెద్ద చెట్టవై, నాకు మామిడి కాయలు ఇవ్వు, సరేనా?" అని అడిగేది.

కానీ, ఒక రోజు నీతూ తన అమ్మ, నాన్నలతో ఊరు వెళ్లిపోయింది. చదువులో బిజీ అయిపోయి, తాతయ్య ఇంటికి రాలేకపోయింది. అయినా, ఆమె మనసు మాత్రం తన చిన్న మామిడి చెట్టు దగ్గరే ఉండేది. అప్పుడప్పుడూ తాతయ్యతో ఫోన్‌లో మాట్లాడి, "తాతా, నా చెట్టు ఎలా ఉంది?" అని అడిగేది. తాతయ్య నవ్వుతూ, "బాగా పెరుగుతోంది, నీతూ!" అనేవాడు.

సంవత్సరాలు గడిచాయి. నీతూ ఇంటర్మీడియట్ పూర్తి చేసి, ఇంజనీరింగ్ కాలేజీలో చేరే సమయం వచ్చింది. అమ్మ, "నీతూ, కాలేజీలో చేరే ముందు తాతయ్యను చూసి, ఆశీర్వాదం తీసుకుని రా," అని చెప్పింది. నీతూ ఆనందంగా తాతయ్య ఇంటికి వెళ్లింది.

"తాతా, నా మామిడి చెట్టు ఎలా ఉంది?" అని అడిగింది. తాతయ్య కళ్లలో మెరుపు! "పద, చూపిస్తా!" అంటూ ఆమెను పెరట్లోకి తీసుకెళ్లాడు. అక్కడ, నీతూ నోరెళ్ళబెట్టింది!

ఆ చిన్న మొలక ఇప్పుడు పెద్ద మామిడి చెట్టుగా మారి, గుత్తులుగా మామిడి కాయలతో నిండి ఉంది! ఆ కాయలు ఎండలో మెరిసిపోతున్నాయి.


"తాతా, ఇది నా చెట్టా?" అని నీతూ ఆశ్చర్యంగా అడిగింది. తాతయ్య నవ్వి, "నీ చేతి మహిమ, నీతూ! నీవు నీళ్లు పోసి, ప్రేమగా చూసుకున్నావు కదా, అందుకే ఈ చెట్టు ఇంత పెద్దదై, కాయలు కాసింది!" అన్నాడు.

నీతూ ఆనందంతో ఒక మామిడి కాయను తీసి, తాతయ్యతో కలిసి తిన్నది. ఆ పండు ఎంత తియ్యగా ఉందో! "తాతా, ఇది నా జీవితంలో తిన్న అతి తియ్యని మామిడి!" అని అన్నది. ఆ రోజు నుండి, నీతూ తన మామిడి చెట్టును "మాయాచెట్టు" అని పిలిచేది. ఎందుకంటే, ఒక చిన్న టెంక నుండి పెద్ద చెట్టు వరకు, ఆ చెట్టు ఆమెకు ప్రేమ, ఓపిక, ఆనందం నేర్పింది. ఆ కథ ఊరంతా తెలిసి, పిల్లలందరూ నీతూ చెట్టు దగ్గరకు వచ్చి, మామిడి కాయలు తిని, ఆ చెట్టు కథను వినేవారు.

– ఎస్. రక్షిత
10వ తరగతి, తెలంగాణ మోడల్ స్కూల్,
ఘన్ పూర్ (స్టే), జనగామ (జిల్లా)
గైడ్ టీచర్: రమేశ్, 9908912662

**పాట**

# సుర్రు.. గుర్రు..



అగ్గి పుల్ల.. బర్రు
పిట్ట పిల్ల.. బుర్రు
పంది పిల్ల.. తుర్రు
ఎలుక పిల్ల.. దుర్రు
పిల్లి పిల్ల.. జుర్రు
వేడి పాలు.. సుర్రు
తాగలేక.. గుర్రు
మూతి కాలి.. ఒర్రు..
కుర్రో.. కుర్రు..
గుర్రో... గుర్రు..

– గంగదేవు యాదయ్య
ఉయ్యాలా జంపాలా
m : 90591 12105

చందదారులుగా చేరండి!

బాల చెలిమి

చందదారులను చేర్పించండి!

SCAN & PAY

'యం. వేదకుమార్ సంపాదకత్వంలో వెలువడుతున్న 'బాల చెలిమి' పిల్లల మాసపత్రిక బాలబాలికలకు చేరడంలో తల్లిదండ్రుల, ఉపాధ్యాయ, పాఠశాల నిర్వహకుల, మేధావుల అమూల్య సహకారాన్ని కోరుతున్నాం. చందదారులుగా చేరడంతోపాటు తమకు తెలిసినవారిని చందదారులుగా చేర్పించాల్సిందిగా అభ్యర్థిస్తున్నాం.

**మా చిరునామా :**
BALA CHELIMI
"CHANDRAM" 3-6-712/2,
St. No. 12, Himayatnagar
Hyderabad - 500 029.
Mob: 9030626288
E-mail:desk. chelimi@gmail. com,
www. balachelimi. com


**చందా వివరాలు :**

| | |
|---|---|
| విడి ప్రతి | : రూ. 40 |
| వార్షిక చందా | : రూ. 400 |
| 2 సంులకు | : రూ. 750 |

'బాల చెలిమి' పేరిట నగదు, చెక్ లేదా ఆన్‌లైన్ రూపంలో చందామొత్తం చెల్లించవచ్చు.

**ACCOUNT DETAILS :**

| | |
|---|---|
| Bank Name | : Canara Bank |
| A/C No. | : 30101010003714 |
| Branch | : Ashoknagar, HYDERABAD. |
| IFSC Code | : CNRB0013010 |



# ఉపాయం

సింగారం అడవిలో జామ చెట్లు అధికంగా ఉన్నాయి. ఒక చెట్టుపై చిలక జామకాయను తినడానికి ప్రయత్నిస్తుంది.

అప్పుడే అక్కడకు వచ్చిన వేటగాడు కాయలు కొరకడం ఇబ్బందిగా ఉంటుంది. అదికాక, కాయలు పండ్లు అంత రుచిగా కూడా ఉండవు. మా ఇంటిలో జామపండ్లున్నాయి. నువ్వు వస్తే ఆ పండ్లు తినడానికి ఇస్తాను అన్నాడు.

సరేనని వేటగాడిని వెంబడించింది చిలుక. జామ పండ్లను చూసి చిలుక తినడానికి చూస్తుంటే...

వంటింట్లోకి వెళ్లిన వేటగాడు భార్యతో – 'చిలుకను తెచ్చాను. చిలుకకు జోస్యం చెప్పేవానికి అమ్మితే... మనకు బోలెడు డబ్బు వస్తుంది.'

ఈ మాటలు విన్న చిలుక – తప్పించుకోవడానికి ఏదైనా ఉపాయం ఆలోచన చేయాలనుకుంది.

అంతలోనే వేటగాడు చిలుక వద్దకు వచ్చాడు. 'జామపండ్లు బాగున్నాయా' అని వేటగాడు అనగానే –

జామపండ్లు బాగున్నాయి కాని, నేనే తింటే ఏం బాగుంటుంది. మా చిలుకలు నాతో స్నేహంగా ఉంటాయి. నీవు అనుమతిస్తే ఆ చిలుకలను అన్నింటిని తోలుకొని వస్తా. ఇక్కడే జామపండ్లు తినుకుంటూ ఉంటాం అని చిలుక అనగానే...

ఇదేదో బాగుంది. ఒక చిలుకనే అమ్ముకుంటే వచ్చేదానికంటే... ఈ చిలుకను వదిలితే... ఈ చిలుకతో పాటు వచ్చే ఆ పది చిలుకలను కూడా అమ్ముకోవచ్చు అనుకున్నాడు. వేటగాడు సంతోషంతో సరేనని అనేసరికి...

టాటా చెప్పిన చిలుక రివ్వున ఆకాశంలోకి ఎగిరి పోయింది.

ఒక రోజు రెండు రోజులు చిలుకలకై చూసిన వేటగాడు చిలుక ఉపాయంగా తప్పించుకుంది అనుకున్నాడు.

'దొరికిన దానితో తృప్తి పడక అత్యాశకుపోతే... ఇలాగే ఉంటుంది మరీ!'

– ఎన్నవెల్లి రాజమౌళి
m : 98485 92331

ఆట

# రైళ్ళ పోటీ



ఎంత మంది పాల్గొనవచ్చు – **15 మంది**

ఎక్కడ ఆడవచ్చు – **ఆరుబయట**

'రైళ్ళ పోటీ' ఆటలో పదిహేను మంది పిల్లలు కలిసి మూడు జట్లుగా ఏర్పడాలి. అంటే అయిదుగురు ఒక జట్టుగా ఏర్పడాలి. (ఒక్కో జట్టు ఒక్క రైలు అన్నమాట) అందరూ ఒకరి చొక్కా వెనుక భాగం మరొకరు పట్టుకుని మూడు రైళ్ళలాగా నిలబడాలి.

100 మీటర్ల దూరంలో చేరవలసిన గీతను నిర్ణయించాలి. లీడర్ స్టార్ట్ చెప్పగానే మూడు రైళ్ళూ కదిలి గీతను చేరుకుని తిరిగి వెనక్కి రావాలి. ఏ జట్టు రైలు ముందుగా ప్రారంభ గీతను చేరుకుంటే వారు విజేత.

మధ్యలో ఎవరైనా పిల్లల చొక్కాలు వదిలేస్తే వాళ్ళ రైలు ఓడిపోయినట్లే. అంటే వారు పోటీ నుంచి వైదొలగాలి.



**ప్రయోజనం :**

ఈ ఆట ఆడటం ద్వారా పిల్లల మధ్య సమన్వయం, నాయకత్వం లక్షణాలు అధికమవుతాయి.

– 'చిన్ననాటి ఆటలు – జ్ఞాపకాల మూటలు' నుండి...

✧ సీరియల్-1

# రాకాశిలోయ – రత్నాలదీవి




'కూచిమంచి నాగేంద్ర గారు బాల చెలిమి పాఠకులకు సుపరిచితులు. వీరి కథలు బాలచెలిమిలో అచ్చయ్యాయి. చిన్న చిన్న పదాలతో సరళమైన భాషతో వీరి రచనలు ఆకట్టుకుంటాయి. వీరి రాకాశిలోయ - రత్నాలదీవి నవల బాలచెలిమిలో ప్రతి నెలా ధారావాహికగా ప్రచురిస్తున్నాం. తన తండ్రిని వెదుక్కుంటూ 16 సంవత్సరాల యువకుడు సముద్రం మీద సాగించిన ఉత్కంఠభరితమైన ఈ సాహస ప్రయాణం మిమ్మల్ని అలరిస్తుందని ఆశిస్తున్నాం - సంపాదకులు)'

బాగ్దాద్ పట్టణం ప్రశాంతంగా ఉంది. సమయం సాయంత్రం ఆరు గంటలు. టైగ్రిస్ నది ఒడ్డున కూర్చున్నాడో యువకుడు. వయస్సు పదహారు సంవత్సరాలు ఉంటుంది. చేతిలో ఉన్న ఒక్కొక్క రాయి బలంగా నదిలోకి విసురుతున్నాడు. రాయి పడిన చోటున నీరు చెదిరి అలలు అలలుగా పాకుతున్నాయి. ఆ అలల లాగే వాడి మనస్సు కల్లోలంగా ఉంది. ఆ యువకుడి పేరు హసన్. బాగ్దాద్ బజారులో అందరికీ కావలసిన చిన్న చిన్న పనులు చేసి పెడుతూ, ఆ డబ్బులతో జీవనం సాగిస్తూ ఉంటాడు. హసన్, చోటా హసన్, భాయి హసన్ అని అందరూ పిలుస్తూ ఉంటారు. కానీ ఈ రోజు పని సరిగా చేయలేదని "దొంగ కొడుకువి, ఇంతకన్నా ఏం చేస్తావులే!" అన్నాడు ఓ సేట్. ఇంతకాలం తన తండ్రి గురించి తెలీదు. కానీ ఇప్పుడు ఆ సేట్ అన్న మాటలతో తన తండ్రి ఒక దొంగ అని తెలిసింది. అది నిజమా! ఇన్ని రోజులు దీదీని అడిగినా ఏమీ చెప్పలేదు. అది హసన్ బాధ. అందుకే ఆ నది ఒడ్డున కూర్చున్నాడు ఇంటికి వెళ్ళకుండా!

"హసన్ బేటా.. హసన్ బేటా.." అంటూ చిన్న లాంతరు పట్టుకుని హసన్ ని వెతుకుతూ వచ్చింది హసీనా దీదీ. ఒంటరిగా కూర్చున్న హసన్ దగ్గరకి వచ్చింది. "ఏమయింది బేటా! ఇలా ఒక్కడివే ఇక్కడ కూర్చున్నావు?" అడిగింది దీదీ. కళ్ళ నిండా నీళ్ళతో ఏడుస్తూ "చెప్పు దీదీ! మా నాన్న దొంగా? నిజం చెప్పు" అన్నాడు. హఠాత్తుగా వాడు అలా అనేసరికి నిర్ఘాంతపోయింది హసీనా. "ఎవరు బేటా! ఎవరు ఆ మాట అన్నది? మీ నాన్న బంగారం. చాలా మంచివాడు. మీ నాన్నని దొంగ అన్నవాడిని అల్లా క్షమించడు" అంది. మరలా "అయినా ఎవరో ఏదో అన్నారని నువ్వు ఇలా కూర్చోవడం సబబు కాదు. పద బేటా! రొట్టెలు చేశాను. ఘుమఘుమలాడే పాయసం చేశాను. రా బేటా!" అంది దీదీ.

"మా నాన్న ఎవరో చెప్తా అంటేనే నేను ఇంటికి వస్తాను. లేకుంటే ఈ నదిలో దూకి చచ్చిపోతాను" అన్నాడు హసన్.

"హా.. బేటా.. హా.. మీ నాన్న ఎవరో చెబుతాను. ఆయన ఎంత మంచివాడో చెబుతాను. అసలేం జరిగిందో చెబుతాను. ముందు ఇంటికి రా!" అంటూ హసన్ చేయి పట్టుకుని ఇంటి వైపు నడిచింది దీదీ.

"జద్దా! ఇప్పుడైనా మా బాబా గురించి చెబుతావా!"

దీదీ చేసిన రొట్టెలు తింటున్నాడు హసన్.

"ముందు కడుపు నిండా తిను బేటా! తరువాత అన్నీ చెబుతాను" అంది మరొక రొట్టె పెడుతూ.

"దీదీ.. నువ్వు చేసిన రొట్టెలు కమ్మగా ఉంటాయి" అన్నాడు హసన్. తరువాత హసన్ కి జరిగింది చెప్పడం మొదలు పెట్టింది.

"హసన్.. మీ అబ్బీ పేరు జావేద్, చాలా మంచివాడు. పైగా బాగ్దాద్ పట్టణంలో పడవలు, ఓడలు తయారు చేయగలిగేవాడు మీ అబ్బీ ఒక్కడే" అంది దీదీ.

"నిజమా! మా అబ్బీ పడవలు చేసేవాడా!" అన్నాడు ఆశ్చర్యంగా!

"నిజమే బేటా! బాగ్దాద్ పట్టణంలో పడవలు చేయడమే కాదు, వాటికి మరలు అమర్చడం చేయగలిగేది మీ అబ్బీ ఒక్కడే." చాలా సంతోషంగా వింటున్నాడు హసన్.

"అంతే కాదు బేటా! మీ అబ్బీ అలా తయారు చేసిన పడవలు టైగ్రిస్ నదిలో నడిపేవాడు. అలా చాలా మంది మీ నాన్న చేత పడవలు చేయించుకునేవారు" చెప్పింది దీదీ.

"మరి మా అబ్బీ ఎక్కడున్నాడు? అసలు ఉన్నాడా? లేడా?" అడిగాడు హసన్.

"అలా పడవలు చేసి అందరికీ సహాయంగా ఉండే మీ అబ్బీ జావేద్ దగ్గరకి ఒకసారి ఒక రత్నాల వ్యాపారి వచ్చాడు. అతని పేరుహర్షద్." దీదీ చెప్పేది శ్రద్ధగా వింటున్నాడు హసన్.

రాత్రి తొమ్మిది అయ్యింది. చీకటి పడడంతో "ఇక నిద్రపో బేటా, మీ నాన్న కథ రేపు చెబుతా!" అంది దీదీ.

"నాకు నిద్ర రావడం లేదు, చెప్పు దీదీ" అన్నాడు హసన్.


"అది ఒక్కరోజులో చెప్పేది కాదు బేటా! నా మాట వినాలి" అంటూ ఇద్దరికీ చాపలు పరిచి దిండ్లు సర్దింది. ఇక దీదీ ఏమీ చెప్పదని నిద్రకు ఉపక్రమించాడు.

(సశేషం)

– కూచిమంచి నాగేంద్ర
చినవల్తైర్, విశాఖపట్నం –17
m : 91821 27880



# పదాల మేడ-5




| | | | | | |
|---|---|---|---|---|---|
| 1 | | 2 | ✿ | 9 | ✿ |
| | ✿ | 7 | 6 | ✿ | 10 |
| | ✿ | 3 | | | |
| 4 | 13 | ✿ | | ✿ | |
| 5 | | 11 | ✿ | 12 | ✿ |
| ✿ | 8 | | | | |

**అడ్డం:**

1) దేవుడికి చెల్లించే మొక్కు (3)
3) మెరిసే పురుగు (4)
4) చేయి (2)
5) నిశీధి రివర్స్‌లో (3)
7) చెల్లికి అతను.. తిరగబడ్డాడు (2)
8) తెలియక, నేరక (5)



**నిలువు:**

1) జూలై ఆగస్టులో ఉన్న ఏకత్వం (5)
2) వెన్నెల రోజు (3)
6) రేణువు (3)
9) కన్ను ఆంగ్లంలో (1)
10) తోడుకున్న పాలు (3)
11) స్త్రీ సాంప్రదాయ వస్త్రధారణ (2)
12) వక్క.. కింద నుండి పైకి (2)
13) 4,840 చదరపు గజాలు.. ఉల్టా అయ్యింది (3)



– మాదారపు వాణిశ్రీ
హన్మకొండ
m : 9247286668

✦ సైన్స్ వెన్నెల-24

# పైలెట్ చూపును మెరుగుపరిచే శుభ వెంకటేశ అయ్యంగార్ 'దృష్టి' టెక్నాలజీ

ఈ మధ్య పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రా ప్రత్యేకంగా ఒక మహిళా శాస్త్రవేత్తను అభినందించారు. దీనికి కారణం? 2026 జనవరి 28న మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ ప్రయాణం చేస్తున్నా విమానం బారామతి ఎయిర్ పోర్టులో దిగుతున్న సమయంలో వెలుతురు సరిగా లేని కారణంగా ప్రమాదం జరిగి కన్నుమూశారు. సరిగ్గా ఈ సమాచారం ఆనంద్ మహీంద్రను అభినందన సందేశం పంపేలా చేసింది. ఆయన అభినందనలు పొందిన శాస్త్రవేత్త పేరు శుభ వెంకటేశ అయ్యంగార్. ప్రమాదం జరిగినప్పుడే దానికి సంబంధించి కృషి చేసిన వారిని గుర్తు చేసుకోవడం మన స్వభావమేమో! 'దృష్టి' అనే పేరుతో శుభ వెంకటేశ అయ్యంగార్ రూపొందించిన దేశవాళీ టెక్నాలజీ విజిబులిటీని కొలవడానికి చక్కగా పనిచేయడమే కాకుండా చౌకైనది కూడా! 2026లో పద్మశ్రీ లభించడంతో శుభ వెంకటేశ అయ్యంగార్ పద్మశ్రీ పొందిన తొలి సి.ఎస్.ఐ.ఆర్. శాస్త్రవేత్తగా కూడా గౌరవం పొందారు.




బెంగళూరులోని కౌన్సిల్ ఫర్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సి.ఎస్.ఐ.ఆర్.) వారి నేషనల్ ఏరోస్పేస్ లేబరేటరీ (ఎన్.ఏ.ఎల్.)లో నాలుగు దశాబ్దాలకు పైగా కృషిచేసిన శుభ అయ్యంగార్ సాధించిన వైజ్ఞానిక కృషి ఒకవైపు విమానయానానికి, మరోవైపున అగ్ని వంటి మిస్సైల్స్ సంబంధించి కూడా ఎంతో ఉపయోగపడింది. వెంకటేశ, రాజీమ దంపతులకు కలిగిన తొమ్మిది మందిలో ఆఖరు సంతానం శుభ. చాలా సాధారణమైన నేపథ్యమున్న ఈ దంపతులు కుమార్తె చదువుకు ఎంతో దోహద పడ్డారు, కనుకనే ఆమె పిహెచ్.డి. దాకా సాధించగలిగింది. బెంగళూరులోని సెంట్రల్ కాలేజీలో బి.ఎస్సి., ఎం.ఎస్సి. ఉత్తమ స్థాయిలో పూర్తి చేసిన తర్వాత చేసిన పరిశోధన కూడా అదే స్థాయిలో పూర్తి చేశారు. ఈ పరిశోధనా పట్టాకు సంబంధించిన మూడు రీసెర్చ్ పేపర్స్‌ను 1986లో నాసా సంస్థ కూడా తన అధికార నివేదికలలో జోడించిందంటే ఆమె కృషిని ఏ స్థాయిలో ఉందో మనం గమనించవచ్చు. 1974లో బెంగళూరులోని నేషనల్ ఏరోస్పేస్ లాబరేటరీలో చేరి అక్కడే పదవి విరమణ చేశారు. ఆమె జీవిత విశేషాలు పెద్దగా అందుబాటులోకి రాలేదు.

శుభ రూపొందించిన 'దృష్టి' సాంకేతిక సహాయం రాకముందు మన విమానాశ్రయాలలో ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా దేశాలు రూపొందించిన టెక్నాలజీని వినియోగించేవి. ఖరీదైన ఈ విదేశీ టెక్నాలజీకి అవసరమైన మెయింటెనెన్స్ కూడా ఖరీదుగానే ఉండేది. శుభ రూపొందించిన ఈ సాంకేతిక పరికరాల ఏర్పాటుతో మనకు ఖర్చు మూడోవంతుకు తగ్గడమే కాకుండా; అది దిగుమతుల బెడద లేకుండా, స్థానికంగా లభించే వాటితో రూపొందించే అవకాశం కలిగి ఉండటం విశేషం. 2014లో ఈ మహిళా శాస్త్రవేత్త రూపొందించిన 'దృష్టి' టెక్నాలజీని ఢిల్లీ, కోల్కత్తా, లక్నో విమానాశ్రయాలలో వినియోగించడం ప్రారంభించారు. రకరకాల కాలుష్యాలు పెరగడంతో ఢిల్లీ విమానాశ్రయంలో వెలుగు ఎప్పుడు చెదురుతుందో, చీకటి ఎప్పుడు ముసురుకుంటుందో తెలియదు. అటువంటి పరిస్థితుల్లో కూడా శుభ రూపొందించిన 'దృష్టి' కారణంగా విజిబులిటీని చక్కగా లెక్కగట్టే అవకాశం లభించింది. ఈ టెక్నాలజీతో 25 మీటర్ల దాకా ఉండే దట్టమైన పొగ మంచు ఉన్నా లేదా శుభ్రమైన గాలి 2000 కిలోమీటర్ల దాకా ఉన్నా విమానం నడిపే పైలెట్ చూడగలరు. దీని ఆధారంగా విమానాలు దిగవచ్చునో లేదో పైలెట్ నిర్ణయించుకోవచ్చు. ఇటువంటి నిర్ణయం తీసుకునే సమాచారాన్ని 'దృష్టి' అందివ్వగలుగుతుంది, కనుక విమాన యానాన్ని మరింత సురక్షితం చేసింది శుభ పరిశోధన.

మిస్సైల్స్‌కు సంబంధించి ఒక జటిలమైన సమస్యను కూడా శుభ పరిష్కరించ గలిగారు. ఆమె పరిశోధనతో 3000 డిగ్రీల కెల్విన్ ఉష్ణోగ్రతలను కూడా తట్టుకొని ఉండే పదార్థాలను రూపొందించగలిగారు. వీటితోపాటు ఈమె చేసిన వైజ్ఞానిక కృషి రామ్ జెట్ (Ramjet), స్క్రామ్ జట్ (Scramjet) మిసైల్స్‌కు సంబంధించి కూడా ఎంతో దోహదం చేసింది. ఇలా ఎన్నో విజయాలను ఆమె జీవిత కథగా మనం చెప్పుకోవచ్చు. కనుకనే 43 దాకా అకాడమిక్, ప్రొఫెషనల్ అవార్డ్స్ వచ్చిన తర్వాత ఇటీవల పద్మశ్రీ పురస్కారం శుభ వెంకటేశ అయ్యంగార్‌ను వరించింది.

– డా. నాగసూరి వేణుగోపాల్
ఆకాశవాణి విశ్రాంత సంచాలకులు,
ప్రముఖ సైన్స్ రచయిత
m : 9440732 392

# పేరాశ, లోభితనమూ హానికరం



ఒక ఊరిలో వీరమల్లుడు అనే వేటగాడు వుండేవాడు. అతడు అడవికి వెళ్ళి జంతువులను వేటాడి జీవిస్తుండేవాడు.

ఒక రోజు అతడు వల, విల్లు, బాణాలతో వేటకి వెళ్లాడు. ఒకచోట ఎరగా ఆహారం పెట్టి పక్కనే కాస్త దూరంగా వున్న చెట్టు ఎక్కి కూర్చున్నాడు. ఏదైనా జంతువు వస్తే చంపడానికి విల్లు, బాణంతో తయారుగా వున్నాడు.

కాసేపటికి అక్కడికి ఒక బలమైన జింక వచ్చింది. వేటగాడు బాణాన్ని గురిపెట్టి వదిలాడు. జింక వెంటనే చనిపోయింది. వేటగాడు ఆనందంగా దానిని భుజాన వేసుకుని ఇంటికి బయలుదేరాడు. దారిలో బాగా బలిసిన పంది కనిపించింది. వేటగాడు మరింత ఆనందంతో దానిపైకి బాణం వదిలాడు. దానితో గాయపడిన పంది రోషంతో వేగంగా వచ్చి వేటగాడిని కుమ్మింది. వేటగాడు చనిపోయాడు. పంది కూడా గిలా గిలా కొట్టుకుంటూ కొంతసేపటికి చనిపోయింది.

ఆ దారిలో వెళ్తున్న నక్క ఒకటి చచ్చి పడి వున్న జింకను, పందిని, వేటగాడిని చూసి సంతోషంతో ఎగిరి గంతులేసింది. మూడు నెలలకు సరిపడా ఆహారం దొరికింది. ఈ మూణ్ణెళ్ళూ నిశ్చింతగా ఉండొచ్చు అనుకుంది.

పక్కకే విల్లు కనిపించింది. ముందు వింటినారిని తిని చాలకపోతే జింకను కొంచెం తినొచ్చులే అనుకుని వింటినారిని కొరికింది. వింటినారి తెగి విల్లులా వంచిన వెదురుబద్ద వేగంగా వచ్చి నక్క గుండెలో గుచ్చుకుంది. నక్క పెడబొబ్బలు పెడుతూ, అటుయిటూ దొర్లుతూ అదీ చనిపోయింది.

వేటగాడి పేరాశ, నక్క లోభితనమూ తమ ప్రాణాలకే ముప్పు తెచ్చాయి. పేరాశ, లోభితనమూ ఎప్పటికైనా, ఎవరికైనా ప్రమాదమే.

సేకరణ: అమరావతి




## తెలంగాణ చారిత్రక పర్యాటకం

# ఇక్ష్వాకుల కాలంలో దేవాలయాలు

తెలంగాణా ప్రాంతంలో శాతవాహనుల అనంతరం వారి సామంత మాండలీకులు, స్వతంత్ర రాజ్యాలను స్థాపించారు. వారిలో ఇక్ష్వాకులు, తొలి పల్లవులు, బృహత్పలాయనులు, శాలంకాయనులు, ఆనంద గోత్రినులు ముఖ్యులు. కృష్ణాలోయ పరీవాహక ప్రాంతంలో ఇక్ష్వాకుల పాలన దక్షిణ భారతదేశ చరిత్రలో చెరగని ముద్రను వేసింది. శాతవాహనుల కాలంలో వారివద్ద మహాతలవరలుగా ఉన్న ఇక్ష్వాకులు శాతవాహన చివరి రాజైన నాలుగో పులుమావి తర్వాత స్వతంత్రులైనారు. వీరి రాజధాని శ్రీ పర్వత విజయపురి. ఇప్పటికీ నాగార్జునసాగర్‌కు ఇరువైపులా నార్త్ విజయపురి, సౌత్ విజయపురిగా పిలుస్తారు. ఇక్ష్వాకుల రాజ్యస్థాపకుడు వాశిష్ఠీపుత్ర శ్రీ చాంతమూలుడు, సామాన్యశకం 225 నుండి పాలించాడు. తరువాత వీరపురుషదత్తుడు, ఏహువల చాంతమూలుడు, చివరగా రుద్ర పురుషదత్తుడు సా.శ. 300 వరకు పాలించినట్లు శాసనాధారాలు లభించాయి. నాగార్జున కొండ ప్రాంతం మహాయాన బౌద్ధకేంద్రంగా విలసిల్లింది. రాజవంశ స్త్రీలు బౌద్ధాన్ని ఆదరించగా, రాజులు వైదిక బ్రాహ్మణీయ మతాలను విశేషంగా ఆచరించి అశ్వమేధ, వాజపేయ యాగాలు నిర్వహించినట్లు అక్కడ నిర్మించిన కట్టడాలు అవభృతస్నాన ఘట్టం, కూర్మచితి (తాబేలు ఆకారం) యజ్ఞవాటిక, గుర్రం అస్థిపంజరం, మొదటి, రెండవ చాంతమూల, రెండవ వీరపురుషదత్తుడి శాసనాలు, నాణేల ద్వారా తెలుస్తుంది. ప్రస్తుతం నాగార్జున కొండగా పిలుస్తున్న కృష్ణలోయ ఏలేశ్వరం ప్రాంతాల్లో 1947కు ముందు, తర్వాత కేంద్ర, రాష్ట్ర పురావస్తు శాఖలు జరిపిన త్రవ్వకాల్లో దాదాపు 30కి పైగా బౌద్ధ ఆరామ కట్టడాలు, శిల్పాలు, శాసనాలు, నాణేలతో పాటు తొలివైదిక మత సంబంధమైన (ఇటుకలతో నిర్మించిన) దేవాలయ నిర్మాణాలు ఇక్కడ విశేషంగా అభివృద్ధి చెందినట్లు తెలుస్తుంది. ఏహువల చాంతమూలుని కాలంలో కార్తికేయ, పుష్పభద్ర, నొదగీశ్వర, దేవీ ఆలయాలు, అష్టభుజ స్వామిపేర వైష్ణవ ఆలయం, మరికొన్ని ఆలయాలు గజపృష్టాకారంలో, బౌద్ధచైత్యాలయాలు, పలు మండపాలు నిర్మింప బడినాయి. వీరపురుషదత్తుని కాలంలో దేవాలయ నిర్మాణం మరింత వేగం పుంజుకొని తన పాలన 11, 16 సంవత్సరాలకు చెందిన శాసనాల్లో ఏలిశ్రీ అనే అధికారి సర్వదేవాధివాసం, శ్రీవిలాసం అనే దేవాలయాన్ని, పుష్పభద్రస్వామి ఆలయం ముందు ధ్వజస్తంభం, ఆలయ నిర్వహణకు చేసిన భూదానం గురించి వివరిస్తున్నాయి. **సర్వదేవాధివాసం** అనే ఆలయం రెండు దీర్ఘచదరాలను కలిపినట్లుండే పెద్ద ఆలయం వెనక 6 స్థంభాల మంటపం, ముందు 9 స్థంభాలు, పశ్చిమం వైపున 24 స్థంభాలు, ఉత్తరాన 66 స్థంభాలు, తూర్పుగా మరో 27 స్థంభాల మంటపాలు నిర్మించబడి ఇది అతిపెద్ద దేవాలయంగా గుర్తించబడింది. సర్వదేవుడనగా శివుడని పరిశోధకులు గుర్తించారు. **పుష్పభద్రస్వామి ఆలయం** నదికి ఒడ్డున చుట్టూ ప్రాకారం, నాలుగు వైపులా ద్వారాలు, గజపృష్టాకార గర్భాలయం, స్థంభాలతో మంటపం, ధ్వజస్థంభం దాని ముందు గోపురాన్ని పోలిన కట్టడ పునాదులు వెలుగు చూశాయి. దక్షిణ భారతదేశంలోనే ఈ ఆలయం అన్ని అంగాలతో నిర్మించిన తొలి ఆలయంగా పేర్కొనవచ్చును. **దేవసేనాలయం** ఇటుకరాయి ప్రాకారం లోపలి మంటపం మాదిరిగా నిర్మించిన ఈ ఆలయం ముందు వేదిక మీద మరో మంటపం, దేవాలయం పీఠం, మీద దేవసేన (కార్తికేయుని భార్య) ప్రతిమ ప్రతిష్టించబడి ఉంది. 36 స్థంభాల మంటప స్థంభాలన్నీ అందంగా చెక్కబడి, వాటిపై యక్షులు, సింహం, దున్న, గుర్రం, ఖడ్గమృగాల బొమ్మలు శిల్పుల పనితనాన్ని తెలియజేస్తున్నాయి. **కార్తికేయాలయం** మూడు భాగాలుగా నిర్మించిన ఈ ఆలయం వెనుక గర్భాలయం, ముందు మంటమంటపం, దానిముందు 36 స్థంభాల మహామండపం ఉంది. ఇక్కడ జరిపిన త్రవ్వకాల్లో కార్తికేయుని కంచు ప్రతిమ, ప్రక్కనే తలలేని రెండు కార్తికేయ రాతి శిల్పాలు దొరికాయి. **అష్టభుజస్వామి ఆలయం** తూర్పు ద్వారంతో స్థంభ మంటపాలు, గజపృష్టాకార కట్టడాలు, త్రవ్వకాల్లో నాణేలు, శంఖాలు వాటిపై చక్రధ్వజ, ఖడ్గధ్వజ అని కింద 'భగవతో అరభుజస' 'ఉచ్ఛిట కనసరో అనే శాసనాలున్నాయి. ఇక్కడ ప్రత్యేకంగా పెంబక కుటుంబానికి చెందిన వర్ధమానకుడనే శిల్పి చెక్కినట్లు ప్రస్తావన శాసనం లభించింది. **నవగ్రహాలయం** నాగార్జునకొండ కోటకు వాయువ్యంగా జరిపిన త్రవ్వకాల్లో, నవగ్రహ, శివపార్వతీ, యక్ష, కుబేరాలయాలు, నవగ్రహాలయంలో రెండు గజపృష్టాకారా దేవాలయాలు, మంటపాలు బయల్పడినాయి. **కుబేరాలయం** ఇక్కడనే జరిపిన త్రవ్వకాల్లో గజపృష్టాకారంలో దీని ముందు 100 స్థంభాల మంటపం, యక్షుని తల, దక్షిణాన ఒక బావి దానిపైన సరస్ అనే శాసనం లభించింది. సంగారెడ్డి జిల్లా కంది, జోగులాంబ - గద్వాల జిల్లా కూడలి సంగమేశ్వరం ప్రాంతాల్లో సంగమేశ్వర దేవాలయం కింద ఇక్ష్వాకుల కాలం నాటి ఇటుకల దేవాలయ కట్టడాల పునాదులు గుర్తించబడ్డాయి. ఇక్ష్వాకుల కాలం ప్రాచీన ఇటుక, రాతి దేవాలయ వాస్తు చరిత్రలో ఒక కీలకమైన మైలురాయిగా భావించవచ్చును.

- దేశరాజు శ్యాంసుందర్‌రావు - స్థపతి
m : 9010051177

# బరువు మారిందా?




ఇది ఒక విచిత్రమైన సమస్య. దీనిని ప్రత్యక్షంగా చేసి చూడటానికి ఒక ఖాళీ దారపు బండి, ఇనప తీగ, రబ్బరుముక్క, దారం ఉంటే చాలు. ఇనప తీగను దారపు బండి రంధ్రంలో దూర్చి, చివరలు వంచి “లూపు” లాగాచేసి, దానికి అర కిలో లోపు బరువుగల వస్తువు దేన్నైనా కట్టాలి. గోడకి మేకుకొట్టి, దానికి రబ్బరు ముక్క ఒక కొస కట్టు. రెండవ కొసకు తాడు కట్టి, ఆ తాడును దారపు బండి కింద నుంచి దూర్చి ‘అ’ బొమ్మలో చూపించినట్లు దాని కొసను చేతితో పట్టుకో. ఇప్పుడు ఆ రబ్బరు ముక్క ఎంత పొడుగు సాగిందో కొలిచి చూడు. వేలాడుతున్న వస్తువు బరువు మీద ఈ పొడవు ఆధారపడి ఉంటుందని ఒప్పుకుంటారు కదూ?

ఇప్పుడు చేయవలసినది ఏమిటంటే చేతితో పట్టుకున్న తాడు కొసను ‘ఆ’ బొమ్మలో చూపినట్లు దారపు బండికి చుట్టి గట్టిగా కట్టి వదిలెయ్యి. ఇలా చేస్తే ఆ రబ్బరు ముక్క వెనకటికన్నా ఎక్కువగా సాగుతుందా? కుంచించుకుంటుదా? అంతే ఉంటుందా?

జాగ్రత్తగా ఆలోచించి ఈ ప్రశ్నకి సమాధానం ఇవ్వాలి. “వేలాడుతున్న వస్తువు బరువులో మార్పు ఏమీ లేదు. కాబట్టి రబ్బరు ముక్క పూర్వం ఉన్నంత పొడుగ్గానే ఉండిపోతుంది,” అని ఊహిస్తున్నారా?

స్వయంగా చేసి చూడండి, ఆశ్చర్యపోతారు. రబ్బరు ముక్క పొడవు వెనకటి కన్నా రెట్టింపు అవుతుంది! కారణం తెలిసిందా?

రెండవసారి ఆ వస్తువు బరువునంతా రబ్బరు ముక్క మోస్తోంది. ‘అ’ బొమ్మలో వస్తువు బరువులో సగం నీ చెయ్యి భరిస్తోంది; మిగిలిన సగం మాత్రమే రబ్బరు ముక్క మోస్తోంది.

కప్పీలను ఉపయోగించి బరువులను తేలికగా ఎత్తగలగడంలోని రహస్యం ఇదే. ఈ విషయాన్ని రెండు వేల ఏళ్లకు పూర్వమే గ్రీకులు తెలుసుకున్నారు.

– డాక్టర్ మహీధర నళినీ మోహన్

‘ప్రతి ఇంటా ప్రయోగశాల’ నుండి

లఘు నాటిక




# బాలగాంధి

టీచర్: పిల్లలూ రేపు మీకు సెలవు ఎందుకు ఇస్తున్నారో తెలుసా?

కౌశిక్: తెలుసు టీచర్ గాంధీ జయంతి

టీచర్: మరి గాంధీ జయంతి అని ప్రత్యేకంగా సెలవు ఇచ్చేందుకు గాంధీ చేసిన పని ఏమిటి?

దివిజ: నేను చెప్తాను టీచర్ గాంధీ మనకు స్వాతంత్రం తీసుకురావడంలో కృషి చేశాడు.

టీచర్: గాంధీతో పాటు చాలామంది నాయకులు స్వాతంత్ర్యం కోసం కృషి చేశారు ఎందుకు మరి గాంధీ జయంతి అని జరుపుకోవడం?

విరాట్: టీచర్ గాంధీలో మరేదో ప్రత్యేకత ఉంది అదేంటో మీరే చెప్పండి

విరాట్, దివిజ, కౌశిక్ రేవంత్, స్నిగ్ధ: చెప్పండి టీచర్ ప్లీజ్ చెప్పండి.

టీచర్: మహాత్మా గాంధీ అక్టోబర్ రెండవ తేదీన పోర్ బందర్‌లో జన్మించారు. గొప్ప నాయకుడిగా మారిన విషయం మనకు అందరికీ తెలును. ఏ నాయకుడైనా నాయకుడిగా మారడానికి వారి జీవితంలో ఎదురైన సంఘటనలు దాని నుంచి నేర్చుకున్న విషయాలు ఆ మనిషి జీవితంపై ప్రభావం చూపిస్తాయి. సత్యం అహింస అని రెండు అంశాలు పాతుకు పోవడానికి దారి తీసిన కొన్ని సన్నివేశాలను మనం తెలుసుకుందాం.

రేవంత్: టీచర్ మీరు ఇటు పక్క కూర్చొని చెబుతూ ఉండండి మేం వీలైతే ఆ సన్నివేశాలను స్కిట్‌గా వేసే ప్రయత్నం చేస్తాం.

టీచర్: పిల్లలు నా వ్యాఖ్యానంతో మీ సంభాషణలు జోడిద్దాం

### సన్నివేశం - 1

టీచర్ : (పక్క నిలబడి చెబుతూ ఉంటుంది) (స్టేజికి అటు పక్కన పిల్లలు అభినయం చేస్తుంటారు) గాంధీ పూర్తి పేరు మోహన్ దాస్ కరంచంద్ గాంధీ. పుట్టడమే మహాత్మునిగా పుట్టలేదు అతని బాల్యంలోకి ఒకసారి తొంగి చూద్దాం. (బాల గాంధీ మంచం మీద పడుకుని ఉంటాడు పేరు మోహన్. తల్లి పుతలీ బాయి వస్తుంది)

పుతలీ : మోహన్ మోహన్ బడికి వేళవుతుంది నాయన ఇంకా లేవలేదు లే నాయనా!

మోహన్: అమ్మ ఇంకాసేపు పడుకుంటాను.

పుతలీ: బడికి వెళ్లాలి కదా. లేచి రెడీ అయి రా (మోహన్ లేచి లోపలికి వెళ్లి కాసేపట్లో బట్టలు మార్చుకొని వస్తాడు)

మోహన్: అమ్మ చూశావా నేను త్వరగా రెడీ అయిపోయి వచ్చాను.

తల్లి: మా మోహన్ మంచి అబ్బాయి. నాన్నా బాగా చదవాలి. మంచి పిల్లవాడిగా ఉండాలి సరేనా

మోహన్: సరే అమ్మ నేను మంచి పిల్లవాడు గానే ఉంటానమ్మా (నమస్కరించి బయటికి వెళ్తాడు)

టీచర్: అలా గాంధీ చిన్నతనంలో తల్లిదండ్రుల మాట వింటూ బడికి చక్కగా వెళ్లి పాఠాలు నేర్చుకుంటూ ఆటలాడుకుంటూ ఉండేవాడు.

టీచర్: ఒకసారి బడిలో ఏం జరిగిందంటే... (పిల్లలందరూ బడిలో కూర్చొన్నట్లు కూర్చుని రాసుకుంటూ ఉంటారు)

టీచర్: పిల్లలు ఈరోజు ఇన్స్పెక్టర్ గైల్స్ తనిఖీ కోసం వచ్చారు. వారిచ్చిన డిక్టేషన్ పదాలను మీరు రాయండి. రాసిన పుస్తకాలు మీరు సరిగ్గా రాసారో లేదో నేను చూస్తాను.

మోహన్: (తలదించుకొని ఎటు చూడకుండా రాస్తూ ఉంటాడు. అందరూ ఒకరి దాంట్లో ఒకరు చూస్తూ రాస్తుంటారు)

టీచర్: ష్... (మోహన్ పక్కన నిలబడి అతను రాస్తున్నది చూసి తప్పు అని సైగ చేస్తుంది.. ముందున్న వారిది చూడమంటుంది.)

మోహన్: (టీచర్ వైపు చూసి తల అడ్డం ఊపి తిరిగి పుస్తకంలో తన దారిన తాను రాసుకుంటాడు) (టీచర్ తల పట్టుకుంటుంది) (టీచర్ దగ్గరికి అందరూ వెళ్లి పుస్తకాలు ఇస్తారు)

టీచర్: స్నిగ్ధ అన్నీ సరిగ్గా రాసావు. దివిజ నువ్వు సరిగ్గా రాసావు. రేవంత్ నువ్వు తప్పులు లేకుండా రాసావు. మోహన్ నువ్వు ఒక్కడివే తప్పు రాసావు.

మోహన్: నేను కాపీ కొట్టలేదు టీచర్ కొట్టను కూడా!

టీచర్: చూశారుగా ఒకరిని చూసి కాపీ కొట్టకుండా తన సొంతంగా తప్పులు ఉన్నా పరవాలేదు అంటూ రాశాడు.

## సన్నివేశం-2

(మోహన్, మోహన్ అన్న, తండ్రి కరంచంద్ గాంధీ, తల్లి పుతలీబాయి)

టీచర్: పిల్లలు అందరూ తప్పులు చేయకుండా ఉంటారని అనుకోకండి పిల్లలు తప్పులు చేస్తారు. మోహన్ కూడా ఒక తప్పు చేశాడు. స్నేహితుడికి డబ్బు ఇవ్వడం కోసం...

మోహన్: స్నేహితుడు డబ్బు అడిగాడు అతనికి ఆ డబ్బు చాలా అవసరం నేను అతనికి డబ్బులు ఇవ్వాలి ఎలాగా.. నా వద్ద అంత డబ్బు లేదు ఏం చేయాలి? ఎలాగా (అటు ఇటు తిరుగుతుంటాడు ఆలోచిస్తుంటాడు)

అన్న: ఏమిటి మోహన్ ఏదో ఆలోచిస్తున్నావు ఏదైనా సమస్యా?

మోహన్: ఆ ఏమీ లేదు అన్నగారు

అన్న: బాగా చదువుకుంటున్నావా

మోహన్: ఆ చదువుకుంటున్నాను

అన్న: (తన చొక్కా విప్పి అక్కడ తగిలించి వేరే చొక్కా వేసుకొని బయటకు వెళ్తాడు)

మోహన్: (అన్న తగిలించిన చొక్కాలో డబ్బు కనిపిస్తుంది. తీయనా వద్దా అని అటు ఇటు తిరుగుతాడు. చివరకు తీసుకుంటాడు బయటకు వెళ్తాడు) (కాసేపటికి తిరిగి లోపలికి వస్తాడు. అటూ ఇటూ తిరుగుతుంటాడు) నేను నా స్నేహితుడికి డబ్బు ఇచ్చి వచ్చాను కానీ నేను చేసినది సరైనదేనా... కాదు కానీ... కాదు ఎందుకు కాదు స్నేహితుడికి ఇవ్వడం కోసమే కదా నేను తీసుకుంది. (అటు ఇటు తిరుగుతూనే ఉంటాడు) అయినా సరే అన్న గారిని అడిగి తీసుకోవాల్సింది కదా అడగకుండా తీసుకోవడం దొంగతనం! అవును నేను దొంగతనం చేశాను నేను తప్పు చేశాను (తల పట్టుకుంటాడు.) నేను చేసింది ముమ్మాటికీ తప్పే! ఈ విషయం నాన్నగారికి చెప్పాలి. నేను వెళ్లి ఎలా చెప్పగలను... చెప్పలేను. ఒక పని చేస్తాను క్షమాపణ లేఖ రాస్తాను. (కలం కాగితం తీసుకుని రాస్తుంటాడు... ఆలోచించి రాస్తున్నట్లుగా రాసి చివరికి దాన్ని మడిచి లోపలికి వెళ్తాడు) (మోహన్ వెళ్ళగానే కరంచంద్ గాంధీ వచ్చి మంచం మీద పడుకొని ఉంటాడు... మోహన్ మెల్లిగా వచ్చి ఆ కాగితం కరం చంద్ తల దగ్గర పెట్టి మెల్లిగా వెళ్లిపోతాడు) (కాసేపటికి కరం చంద్ నిద్రలేస్తాడు. పక్కన కాగితం చూస్తాడు.) ఈ లేఖ ఎవరు రాశారు కింద మోహన్ దాస్ పేరు ఉంది మోహన్ నాకు లేఖ రాయడం ఎందుకు? వచ్చి మాట్లాడవచ్చుగా... చదువుదాం (చదువుతాడు)

పూజ్యులైన నాన్నగారికి నా వల్ల పెద్ద తప్పిదం జరిగింది నేను... నేను అన్నగారి చొక్కా నుంచి డబ్బులు తీసుకున్నాను. అన్నగారి అనుమతి లేకుండా తీసుకున్నాను. అది దొంగతనం. నేను దొంగతనం చేశాను... నేను చేసింది తప్పు అని

గ్రహించాను దయచేసి నన్ను క్షమించండి. ఇకపై ఎప్పుడూ అటువంటి పని చేయను.

ఇట్లు మీ కుమారుడు మోహన్ దాస్.

పుతలీ: ఏమైంది?

కరంచంద్: ఏమీ లేదు మన మోహన్ ఒక తప్పు చేసాడు

పుతలీ : అయితే దండించవలసిందే

కరంచంద్: పుతలీ అందరూ తప్పులు చేస్తారు. మోహన్ చిన్నవాడు. పైగా తన తప్పు తెలుసుకున్నాడు. ఎవరైతే తప్పులు చేస్తారో ఆ తప్పును తెలుసుకొని సవరించుకుంటే బాగుపడతారు మన మోహన్‌లో ఆ పరివర్తన కలిగింది కనుక కొట్టకూడదు అంటూ కాగితం చింపేశారు.(చాటుగా విన్న మోహన్ అది విని కళ్ళు తుడుచుకొని నాన్నకు నమస్కరిస్తాడు)

టీచర్: క్రమంగా గాంధీలో మార్పు చోటు చేసుకుంది తండ్రి గారి లైబ్రరీలో ఉన్న పుస్తకాలు తీసి చదవసాగాడు ఒక పుస్తకంలోని కథ మోహన్‌ని బాగా ఆకట్టుకుంది. అదే శ్రవణ కుమారుడి కథ. వృద్ధ అంధులైన తల్లిదండ్రులను పుణ్యక్షేత్రాలకు తీసుకెళ్తూ దాహం వేస్తుంది అంటే నీరు తేవడానికి చెరువు దగ్గరికి వెళ్లి దశరథుడు వేసిన బాణం తగిలి చనిపోతూ తన తల్లిదండ్రుల దాహం తీర్చమని కోరడం. ఈ కథలో శ్రవణ కుమారుడికి తల్లిదండ్రుల పట్ల ఉన్న ప్రేమ గురించి చదివి మనసులో నింపుకుంటాడు. ఈ కథతో పాటు మరో నాటకం కూడా అతనిపై ప్రభావం చూపించింది.

## సన్నివేశం- 3

మోహన్: ఇక్కడ ఏదో నాటకం వేస్తున్నారు ఇంతకీ ఏం నాటకం?

స్నేహితుడు: నేను విన్నాను ఈ నాటకం పేరు సత్య హరిశ్చంద్ర దీన్ని బలిజేపల్లి లక్ష్మీకాంతం గారు రచించారని చాలా బాగుంటుందని మా మామయ్య చెప్పారు.

మోహన్: అవునా దేని గురించి?

స్నేహితుడు: తన సత్య వాక్పరిపాలన కోసం హరిశ్చంద్రుడు రాజ్యాన్ని సంపదను ఆఖరికి భార్య పిల్లలను కూడా అమ్ముకుంటాడు. చివరకు తాను కూడా ఒక కాటి కాపరి వద్ద దాసుడిగా వెళ్తాడు.

హరిశ్చంద్రుడు: ఎవరక్కడ ఎవరిది శవం?

చంద్రమతి: స్వామి నేను చంద్రమతిని ఈ మన బిడ్డ లోహితాస్యుడిది. పాము కాటుకు గురై మరణించాడు.

హరిశ్చంద్రుడు: (కళ్ళ వెంట నీరు కారుతున్న..) హతవిధీ! నాకేమిటి పరీక్ష? (అని మెల్లిగా అని) నేను ఇక్కడ కాటికాపరిని. సుంకం చెల్లించనిదే శవాన్ని దహనం చేయనివ్వం.

చంద్రమతి: ఏమిటి స్వామి మీరేనా ఇలా మాట్లాడుతున్నది? మన బిడ్డ... అంత కఠిన మనస్కులు ఎలా అయ్యారు స్వామి?

హరిశ్చంద్రుడు: నేను ఇచ్చిన మాట ఎప్పటికీ తప్పను

చంద్రమతి: ఇచ్చిన మాట కోసం సత్యం కోసం రాజ్య సంపద, ప్రియమైన వారు, అన్ని కోల్పోయిన పర్వాలేదా? వాడు వాడు మన పుత్రుడండీ! (ఏడుస్తుంది)

హరిశ్చంద్రుడు: (తాను ఏడుస్తూ కళ్ళు తుడుచుకొని) అన్ని కోల్పోయిన పర్వాలేదు సత్యాన్ని మాత్రం వదలను సత్యాన్ని మాత్రం వదలను. మాట మీదే నిలబడతాను.

(చప్పట్లు)

మోహన్: ఎంత గొప్ప నాటకం!

స్నేహితుడు: అవును మోహన్ ఎంత అద్భుతంగా నటించారు

మోహన్: నేను కూడా ఇకపై సత్యమే పలుకుతాను. సత్యాన్ని వదలను.

(టీచర్ పిల్లలు పాత్రలలో నటించిన వారు అందరూ ఒకే వరుసలో నిలబడతారు. మధ్యలో టీచర్ తన పక్కన మోహన్ పాత్రలో గాంధీ నిలబడతారు)

టీచర్: (ప్రేక్షకుల వైపు చూస్తూ) ఒక చిన్న దొంగతనం, పశ్చాత్తాపం, తల్లి బోధ, తండ్రి క్షమా, శ్రవణ కుమారుడికి తల్లిదండ్రుల పట్ల ప్రేమ, సత్య హరిశ్చంద్రుడి సత్యనిష్ఠ ఇవన్నీ కలిసి మోహన్ దాస్ మనసుని మార్చాయి అలా మారిన బాలుడే పెద్దయ్యాక మహాత్మా గాంధీగా దేశానికి సేవ చేశాడు. అందుకే గాంధీ పుట్టిన రోజున మనమందరం. గాంధీ జయంతిని జరుపుకుంటున్నాం.

పిల్లలు: అవును టీచర్ మహాత్మా గాంధీ నిజంగా నాయకుడు. మనం కూడా ఇకపై సత్యం పలుకుదాం.

(గాంధీ పాత్ర వేసిన రేవంత్ ముందుకు వచ్చి నిలబడి నమస్కరిస్తాడు)

పిల్లలు: మహాత్మా గాంధీకి జై! మహాత్మా గాంధీకి జై!

– డా. సమ్మెట విజయ
m: 99898 20215




# మరికొన్ని రకాల ధాన్యాలు

వైవిధ్యమైన ధాన్యాలు ఆరోగ్యమైన జీవితం

ప్రకృతి ప్రసాదించిన ధాన్యాలు మన ఆరోగ్య రక్షకులు

## దంపుడు బియ్యం లేక ముడి బియ్యం
### Brown Rice



- వీటినే బ్రౌన్ రైస్ అని అంటారు.
- శాస్త్రీయ నామం Oryza Sativa
- వీటిలో 8 విటమిన్, సెలీనియం, మాంగనీస్, మెగ్నీషియం, కాల్షియం, పీచు పదార్థాలు పుష్కలంగా ఉంటాయి.

## కృష్ణ బియ్యం
### Black Rice



- శాస్త్రీయ నామం Oryza Sativa L, Indica
- శతాబ్దాల నుండి అధికంగా పండించే మణిపూర్‌కి **"Geographi-cal identification Tag"** లాంటి అరుదైన గుర్తింపు లభించింది.

## నవారా బియ్యం
### Red Rice



- ఇందులో పోషక విలువలు అధికంగా ఉంటాయి.

## తెల్లని పాలిష్ బియ్యం
### White Rice




- వీటిలో పిండి తప్పితే ఎలాంటి పోషక పదార్థాలు ఉండవు కాబట్టి, ఇవి ఎక్కువగా వాడకూడదని న్యూట్రీషన్లు, నిపుణులు తెలియ చేస్తున్నారు.

## మొక్కజొన్న (Maize)



- శాస్త్రీయ నామం Zee Mays
- ఇది ఒక ముఖ్యమైన ఆహార ధాన్యం. ప్రపంచ వ్యాప్తంగా అత్యధికంగా పండించే పంటల్లో ఇది నాల్గవ స్థానంలో నిలిచింది.
- వీటిని బేకింగ్ పౌడర్ తయారీలో, ఔషధాల తయారీలో ఇంకా అనేక రూపాల్లో వాడుతున్నారు.

## ఓట్స్ లేక యవలు (Oats)



- శాస్త్రీయ నామం Avena Sativa
- వీటిని హటరీమియో మందుల తయారీలో కూడా వాడుతారు.

## క్వినోవా (Quinoa)



- శాస్త్రీయ నామం Chenopodium quinoa
- ఇవి తెలుపు, నలుపు, ఎరుపు రంగులలో లభిస్తాయి




– 'ఆరోగ్యం-విజ్ఞానం' పుస్తకం నుండి..

✢ చెట్టు - చేమ

# అశోక చెట్టు



హాయ్ విద్యార్థులూ...ఎలా ఉన్నారు? గురు పూజోత్సవం, వినాయక నిమజ్జనం బాగా చేశారా? మనం ఈ నెల బాల చెలిమి సంచికలో అశోక వృక్షం గురించి తెలుసుకుందాం. సంస్కృతంలో అశోక అంటే దుఃఖము లేనిది లేదా బాధలను తొలగించేది అని అర్థం. అశోక వృక్షం యొక్క శాస్త్రీయ నామం "సరకా అశోకా". ఇది సీసల్పినేసి కుటుంబానికి చెందింది. ఈ అశోక చెట్లు గుత్తులు గుత్తులుగా నారింజ మరియు ఎరుపు రంగులో పూలు ఆకర్షణీయంగా పూస్తాయి. ఒడిస్సా రాష్ట్రం అధికారిక పుష్పం అశోక పువ్వు. అశోక చెట్లకు హిందూ, బౌద్ధ మతాల్లో ఎంతో పవిత్ర స్థానం ఉంది. గౌతమ బుద్ధుడు అశోక వృక్షం కింద జన్మించాడని నమ్ముతారు. ఈ చెట్లు ఏడాది పొడవునా పచ్చగా ఉండి ఉద్యానవనాలకు అందాన్ని ఇస్తాయి. భారతదేశంలో అశోక వృక్షాన్ని పవిత్రమైనదిగా భావిస్తారు. అశోక చెట్లు భారతదేశం అంతటా ముఖ్యంగా హిమాలయాలు, కేరళ, బెంగాల్, దక్షిణ ప్రాంతాలలో ఎక్కువగా కనిపిస్తాయి.


**అశోక వృక్షం యొక్క ఉపయోగాలు :**


అశోక వృక్షం వల్ల కలిగే కొన్ని ప్రయోజనాలు ఇప్పుడు చూద్దాం. అశోక వృక్షాన్ని ఆయుర్వేదంలో విస్తృతంగా ఉపయోగిస్తారు.

- అశోక వృక్షం యొక్క ఆకులు, పూలలో వున్న సమ్మేళనాలు వాపును తగ్గించగలవు. అంతేగాకుండా మూత్రపిండాలలోని రాళ్ళను తొలగించడానికి ఇవి సహాయ పడతాయి.
- అశోక వృక్షానికి జ్వరాన్ని తగ్గించే గుణాలు ఉంటాయి.
- ఈ చెట్టు సూక్ష్మజీవుల సంక్రమణలకు వ్యతిరేకంగా పని చేయగలదు.
- అశోక వృక్షంలోని భాగాలు శరీరం నుండి నులి పురుగులను బయటకు పంపడానికి సహాయ పడతాయి.
- అశోక చెట్టు ఆకులు మరియు పూలకు యాంటీ ఆక్సిడెంట్ గుణాలు ఉంటాయి.
- అశోక వృక్షం నుండి లభించే ఫ్లవనాయిడులు చర్మ క్యాన్సర్‌కు కారణమయ్యే ఎంజైములను తగ్గించగలదు.
- అశోక చెట్టు బెరడును పొడిచేసి తేనేతో కలిపి తీసుకోవచ్చు. బెరడు కషాయాన్ని పాలతో కలిపి సేవించవచ్చు.
- అశోక వృక్షం ఆకులను పూజా మందిరంలో పెట్టి భగవంతుణ్ణి ప్రార్థించి ధ్యానం చేస్తే మంచిది.

శోకాలను దూరం చేసే ఈ అశోక చెట్లను ఇంటి పరిసరాలలో, పాఠశాల పరిసరాలలో, ఉద్యానవనాలలో అందం కొరకు బాగా పెంచుతారు. ఈ చెట్లు ఎక్కడైతే పెంచుతారో అక్కడ బాధలు, శ్లోకాలు, ఉండవని అర్థం. ఇవి పెద్ద పెద్ద కొమ్మలు లేకుండా నిటారుగా శంకువు ఆకారంలో 30 అడుగుల ఎత్తు వరకు పెరుగుతాయి. మరి ఎందుకు ఆలస్యం? వెంటనే మనం కూడా ఖాళీగా ఉన్న ప్రదేశంలో అశోక చెట్లను నాటుదాం. పర్యావరణాన్ని కాపాడుదాం.

- కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి
m : 9441561655


అపార్థం
కథ : జుగాష్‌విలి
బొమ్మలు:
తాతయ్య : ఏరా గోపీ! రెండు రోజుల్నించి గమనిస్తున్నాను. ఎందుకంత డల్‌గా ఉన్నావు.
గోపి : నాకు మా ఫ్రెండ్‌కీ గొడవైంది తాతయ్యా! నాతో మాట్లాడ్డం లేదు. చాలా గుబులుగా వుంది.
తాతయ్య : మీ అలకలెంత సేపుంటాయిరా! ఇదేమన్నా జాతి వైరమా!
గోపి : జాతి వైరమా? అంటే ఏమిటి తాతయ్యా!
తాతయ్య : రెండిటి మధ్య సహజ శతృత్వాన్ని జాతి వైరం అంటారు. ఉదాహరణకి కుక్క-పిల్లి, పాము-ముంగిస, పిల్లి-ఎలుక, పులి-మేక వీటి మధ్య ఉండేదాన్ని జాతి వైరం అంటారు.
గోపి : వాటి మధ్య వైరం ఎందుకు తాతయ్యా!
తాతయ్య : ప్రకృతిలో ఆహారం, రక్షణ, జీవన పోరాటాల వల్ల వచ్చే సహజ ప్రవర్తన యిది.
గోపి : మనుషుల్లో ఈ వైరం వుండదా!
తాతయ్య : పరస్పర అపనమ్మకాల వల్ల, భయాల వల్ల, అపార్థాల వల్ల శతృత్వం ఏర్పడుతుంది. దీనివల్ల సమాజంలో ఐక్యత దెబ్బ తింటుంది. అభివృద్ధిని అడ్డుకుంటుంది.
గోపి : దీనికి పరిష్కారం లేదా?


తాతయ్య : ప్రతి సమస్యకీ పరిష్కారం వుంటుంది. సహృదయత, స్నేహభావం ఎంతటి శతృత్వాన్ని కూడా పోగొడతాయి. చివరికి జాతి వైరాన్ని కూడా పోగొడతాయి.
గోపి : అదెలా తాతయ్యా!
తాతయ్య : ఒకే చోట కొంత కాలం కలిసి వుండటం వల్ల చాలా యిళ్ళల్లో పెంపుడు జంతువులు కుక్క, పిల్లి కలిసి ఆడుకుంటూ గంతులెయ్యడం నువ్వు చూసావుగా.
గోపి : అవును తాతయ్యా!
తాతయ్య : మీ ఫ్రెండ్‌కీ నీకూ గొడవకి ఏదో చిన్న అపార్థం కారణమని నేననుకుంటున్నా!
గోపి : నిజమే తాతయ్యా!
తాతయ్య : ఒక కథ చెప్తా విను. ఒక అడవిలో ఒక ఏనుగు ఒక కుక్క ఉన్నాయి. ఏనుగును చూసిన ప్రతిసారీ కుక్క మొరుగుతూ వుండేది. ఒక రోజు ఏనుగు తన పిల్లలతో దారిలో వెళ్తూ కుక్కకు కనిపించింది. కుక్క మొరిగింది. పిల్లలు దడుచుకుని పరుగులు తీసాయి. ఏనుగు కోపంతో తొండం పైకెత్తింది. అప్పుడు కుక్క 'గజరాజా నిన్ను చూసి భయమేసి
మొరుగుతున్నాను. నువ్వు మా శతృవ్వి కాదు' అంది. గజరాజు నవ్వి 'నువ్వు మొరుగుతున్నప్పుడు మా మీద దాడి అని అపార్థం చేసుకున్నాను. ఓకే. యిప్పటి నుంచి మనం స్నేహితులం' అంది. కుక్క సంతోషపడింది.
గోపి : అంత పెద్ద ఏనుగుకు, చిన్న కుక్కకు స్నేహమా! బాగుంది.
తాతయ్య : గోపీ రేపు స్కూలుకెళ్లగానే మీ ఫ్రెండ్‌కి సారీ చెప్పి నువ్వే ముందు పలకరించు. అపార్థాలు తొలిగిపోయి హాయిగా ఎన్జాయ్ చెయ్యండి.
గోపి : ఓకే తాతయ్యా! థాంక్యూ!




# భారత యువ షూటర్ల విజయభేరి


నగోయా వేదికగా జరుగుతున్న 2026 ఆసియా క్రీడల్లో భారత షూటర్లు పతకాల పంట పండించారు. సోమవారం జరిగిన షూటింగ్ పోటీల్లో భారత్ రెండు రజతాలు, ఒక కాంస్యంతో మొత్తం మూడు పతకాలను సాధించింది. పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ వ్యక్తిగత విభాగంలో హిమాన్షు ధిల్లాన్ 252.4 పాయింట్లతో రజత పతకం గెలుచుకున్నాడు. రుద్రాంక్ష్ పాటిల్ 230.9 పాయింట్లతో కాంస్యం సాధించాడు. చైనాకు చెందిన ఒలింపిక్ ఛాంపియన్ షెంగ్ లిహావో 254.2 పాయింట్లతో స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నాడు. క్వాలిఫికేషన్‌లో రుద్రాంక్ష్ 631.8 పాయింట్లతో మూడో స్థానంలో, హిమాన్షు 630.0 పాయింట్లతో ఏడో స్థానంలో నిలిచి ఫైనల్‌కు అర్హత సాధించారు. ఫైనల్ ప్రారంభంలో రుద్రాంక్ష్ ఆధిక్యంలో కొనసాగాడు. 14 షాట్లు ముగిసేసరికి 148.2 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచాడు. అనంతరం అతడు కొంత వెనుకబడగా హిమాన్షు అద్భుతంగా పుంజుకొని రజతాన్ని సొంతం చేసుకున్నాడు. జట్టు విభాగంలో హిమాన్షు, రుద్రాంక్ష్, పార్థ్ మానేలతో కూడిన భారత బృందం 1890.1 పాయింట్లతో రజతం గెలిచింది. చైనా 1899 పాయింట్లతో స్వర్ణం, కొరియా 1884.2 పాయింట్లతో కాంస్యం సాధించాయి. తొలిరోజు మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ వ్యక్తిగత, జట్టు విభాగాల్లో భారత్ రెండు రజతాలు సాధించింది. తాజా విజయాలతో ఆసియా క్రీడల షూటింగ్‌లో భారత పతకాల సంఖ్య ఐదుకు చేరింది. భారత యువ షూటర్ల ప్రతిభ దేశానికి గర్వకారణంగా నిలిచింది.

– బాలచెలిమి డెస్క్

## తెలంగాణ సారస్వత పరిషత్తు బాలల సాంస్కృతికోత్సవం

తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో 2026 నవంబర్ 22, ఆదివారం హైదరాబాద్‌లో బాలల సాంస్కృతికోత్సవం నిర్వహించనున్నారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించే ఈ కార్యక్రమంలో రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన 6 నుంచి 10వ తరగతి విద్యార్థులు పాల్గొనవచ్చు. గేయం/పాట, పద్య కవిత, వచన కవిత, కథ, యాత్రా రచన, చిత్రలేఖనం, ఆశుకవిత్వం, లేఖా రచన, ఏకపాత్రాభినయం, దేశభక్తి గీతాలు, వక్తృత్వం తదితర పోటీలు నిర్వహిస్తారు. మొదటి విభాగానికి సంబంధించిన రచనలను అక్టోబర్ 30లోగా తెలంగాణ సారస్వత పరిషత్తు, తిలక్ రోడ్, అబిడ్స్, హైదరాబాద్‌కు పంపాలి. రెండో విభాగం పోటీలు నవంబర్ 22న ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతాయి. పాల్గొనదలచిన విద్యార్థులు తమ పేర్లను ముందుగా నమోదు చేసుకోవాలి. మరిన్ని వివరాలకు 9603727234 నంబరులో సంప్రదించవచ్చు.

– డా. జె. చెన్నయ్య
ప్రధాన కార్యదర్శి



# జింక - కుందేలు

అనగనగా ఒక అడవిలో జింక, కుందేలు స్నేహితులు. ఇవి రెండు ఎక్కడికి వెళ్ళినా కలిసిమెలిసి వెళ్ళేవి. ఒకరోజు అవి నడుచుకుంటూ వెళుతుండగా ఒక మామిడి తోట కనిపించింది. ఆ తోటలో మామిడి పండ్లు ఎన్నో ఉన్నాయి. తిందామా అని కుందేలు, జింక కలిసి తోటలోకి వెళ్లాయి.

అక్కడ తోట యజమాని ఉన్నాడు మనం ఈ మామిడి పండ్లను తినగలమా అంటూ మామిడి తోటలోకి వెళ్ళి తింటుండగా ఇంతలోనే సింహం అక్కడికి వచ్చింది. కుందేలు మరియు జింక పరిగెత్త సాగాయి. కానీ జింక సింహంకి దొరికిపోయింది.

కుందేలును మిత్రమా ఆగు అని అరుస్తూనే ఉంది. కానీ కుందేలు మాత్రం ఆగకుండా నీ చావు నువ్వు చావు నన్ను మాత్రం రమ్మని పిలవకు అని కుందేలు వెళ్లి పోయింది.

ఆ మాటలు విన్న జింక ఎంతో బాధపడుతుంది. ఇంత లోపే సింహం తనను తినడానికి వస్తుంది. జింక వద్దకు వస్తుంది. జింక సింహంతో ఆగు దగ్గరకు రావద్దు నేనే నీ దగ్గరకు వస్తాను, నీకు ఎందుకు శ్రమ అని అనగా సింహం సరే నువ్వు నా మీద ఇంత ప్రేమ చూపిస్తున్నావు కదా నేనెందుకు కాదంటాను అని సింహం ఆగింది. వెంటనే జింక అక్కడ నుంచి పరుగెత్తుకుని అడవిలోకి వెళ్ళిపోయింది. సింహం నిరాశతో తన గుహ దగ్గరకు వెళ్ళిపోయింది.

జింక అడివి చేరుకోగానే కుందేలుతో నువ్వు నీ చావు చావమని అన్నావు కదా నేను తప్పించుకున్నాను. నీకు నాతో ఏం పని నువ్వు మన స్నేహానికి విలువ ఇవ్వలేదని కోపంగా అడుగుతుంది. నన్ను క్షమించు మిత్రమా నాకు ఆ సమయంలో ఏం చేయాలో అర్థం కాలేదు, నా ప్రాణాలు కోసం పరిగెత్తేనే గాని నీ గురించి ఆలోచించలేదు, నన్ను ఈ ఒక్కసారి క్షమించు మిత్రమా ఇంకోసారి ఇలా చేయను అని ప్రాధేయపడింది. ఆ మాటలు విన్న జింక సంతోషించింది. మళ్లీ ఇద్దరూ కలసి స్నేహితులుగా మెలుగుతారు.

– అస్మిత
8వ తరగతి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల
కల్లివెట్టు, బి. ఎన్ కండ్రిగ
గైడ్ టీచర్ : యువ శ్రీ మురళి
m : 94913 12522

# సృజనాత్మకమైన పనులు అభివృద్ధి




పిల్లలెప్పుడూ స్వయంగా ఏదైనా నిర్మాణాత్మకమైన పనిని చేయాలని ఉవ్విళ్ళూరుతుంటారు. ఆ వయసులో వారికా ఉత్సాహం అవసరం కూడా! ఎందువల్లనంటే సృజనాత్మకమైన ఈ పనులు పిల్లల అభివృద్ధికి అనేక రకాలుగా దోహదం చేస్తాయి.

## సృజనాత్మక పనుల వల్ల కలిగే ప్రయోజనాలు

- గ్రహణేంద్రియాలను ఉపయోగించడానికి
- ఊహాశక్తిని పెంపొందించుకోవడానికి
- భావాలను వ్యక్తం చేయడానికి
- నూతన అనుభవాలను పొందడానికి
- హస్తనైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకోడానికి
- వివిధ అవయవాలను సమన్వయ పరచడానికి
- సౌందర్యాభిలాషను ఇనుమడింపచేయడానికి

అంత చిన్న వయసులోనే పిల్లలతో బొమ్మలు వేయించడం, చేతిపనులు చేయించడంలోని ఉద్దేశం కూడా ఇదే.

## చిత్రలేఖనం (Painting)

పిల్లలకు రంగుల నుపయోగించడమంటే చాలా ఇష్టం. వారికి రంగుల ప్రపంచాన్ని ఎలా పరిచయం చేయవచ్చో చూడండి!




## రంగులు ఎక్కడ వేయాలి?

### కాగితం



మనకు ఉపయోగపడని ఏ కాగితమైనా పిల్లలు రంగులు వేయడానికి పనికి వస్తుంది. వార్తాపత్రికలు, పాత కాగితాలు, కాగితపు సంచులు మొదలైనవి.

### గోడలు, నేల



నున్నగా గచ్చు చేసిన నేలగాని, గోడగాని పిల్లలు రంగులు వేయడానికి ఉపయోగించవచ్చు. ఎటొచ్చీ పని అయిపోయాక ఆ ప్రదేశాన్ని పిల్లలనే శుభ్రం చేయమనాలి.

### మరికొన్ని వస్తువులు



మనకు అందుబాటులో ఉండే చెక్కలు, పీటలు, బల్లలు, కుండలు, డబ్బాలు, పెట్టెలు, పనికిరాని పుస్తకాలు ఇవన్నీ పిల్లలు రంగులు వేయడానికి పనికి వచ్చేవే! ఆఖరుకు తలుపుల మీద కూడా వేయవచ్చు.

**సృజనాత్మకతే మంచి పాఠశాల!**

– శ్రీమతి మీనాస్వామినాథన్
'పిల్లలకు ఆటలు–పాటలు'
పుస్తకం నుండి

కథ

## కాన్‌స్టాంటిన్ పోస్తోవ్‌స్కీ



# మేలు మరవని పిచుక

అనగనగా ఒక ఊరిలో మాషా అనే చిన్న పాప ఉండేది. వాళ్ళ అమ్మ బ్యాలే డ్యాన్సర్.

ఆమె త్వరలో 'సిండ్రెల్లా' అనే నాటకంలో ప్రధాన పాత్రలో నటించనుంది.

మాషా వాళ్ళ నాన్న సైనికుడు. అతడు యుద్ధం చేయడానికి వెళ్ళాడు.

వెళ్ళేముందు అతను ఒక గాజు పూలగుత్తిని మాషా వాళ్ళ అమ్మకు బహుమతిగా ఇచ్చాడు. మాషా వాళ్ళ అమ్మ దాన్ని రోజూ అపురూపంగా చూసుకునేది. సిండ్రెల్లా నాటకం ప్రదర్శించినపుడు, ఆ గాజు పూలగుత్తిని తన గౌనుకు ధరించాలని అనుకుంది.

ప్రతి రోజూ మాషా కిటికీ దగ్గర నుంచుని చుట్టుపక్కల చూస్తుండేది. కాకులు, పిచుకలు చక్కర్లు కొడుతూ కనిపించేవి. ఓ రోజు మాషా తన గదిలో ఆట బొమ్మలతో ఆడుకుంటుంది.

ఇంతలో ఓ కాకి కిటికీలో నుంచి వచ్చి బల్లపై ఉన్న గాజు పూలగుత్తిని ముక్కున కరుచుకుని చక్కా వెళ్ళిపోయింది. ఇది చూసి మాషా పెద్దగా అరిచింది. జరిగింది తెలుసుకున్న మాషా వాళ్ళ అమ్మ ఎంతో బాధపడింది.

మాషా వాళ్ళ ఇంటి ప్రక్కనున్న ఉద్యానవనం దగ్గరలో ఓ ఐస్క్రీం బండి ఉండేది. అది ప్రస్తుతం మూసివేసి ఉంది.

పాష్కా అనే పిచుక ఆహారం కోసం ఐస్క్రీం బండిలో దూరాలని చూసింది. పూర్వం బోల్డన్ని గుర్రబ్బండ్లు ఉండేవి. వాటిని గుర్రాలు లాక్కెళ్ళేవి. గుర్రాలకి గుగ్గిళ్ళు పెడుతున్నప్పుడు కొన్ని కిందపడేవి. పిచుకలు వాటిని తిని హాయిగా బతికేవి.

ఇప్పుడేమో అన్ని కార్లు, బస్సులు, మోటారు వాహనాలు. పిచుకలకు ఆహారం లభించడం కష్టమయిపోయి, నగరంలో వాటి సంఖ్య తగ్గిపోయింది.

పిచుక ఐస్క్రీం బండిలోకి చొరబడటాన్ని, గాజు పూలగుత్తి దొంగిలించిన కాకి చూసింది. పిచుకతో పోట్లాడింది. పిచుక కింద పడింది. ఇది చూసిన ఓ పోలీసు, పిచుకను తీసి తన జేబులో వేసుకున్నాడు.

సాయంత్రం మాషా, వాళ్ళ అమ్మతో ఉద్యానవనానికి వెళ్ళింది. పోలీస్, పిచుకను మాషాకి ఇచ్చాడు. మాషా పిచుకను ఇంటికి తీసుకొచ్చింది. దానికి స్నానం చేయించింది. తిండి తినిపించింది. నిద్రపుచ్చింది. మాషా ఆ పిచుక మంచి స్నేహితులయ్యారు.

మాషా రుణం తీర్చుకోవాలని పిచుక నిర్ణయించుకుంది. విరిగిన దువ్వెన, అప్పడం తునక, కళావరు రాణి పేకముక్క, ఇలాంటివి మాషాకు పిచుక కానుకలుగా ఇచ్చేది. కాని మాషా వాటిని పక్కన పెట్టేసేది. ఇవన్నీ ఎందుకు మాషాకు నచ్చడంలేదో పిచుకకి తెలిసేది కాదు.



ఒకరోజు కాకి వద్ద ఉన్న గాజు పూలగుత్తిని చూసింది పిచుక.

అది మాషా వాళ్ళ అమ్మదని గ్రహించింది. ఆ నగరంలోని పిచుకలన్నింటిని కూడగట్టి, కాకిపై యుద్ధం ప్రకటించింది. కాకికి, పిచుక సైన్యానికి మధ్య భారీయుద్ధం జరిగింది. ఈ యుద్ధాన్ని నగర ప్రజలు ఆసక్తిగా చూశారు. చివరికి పిచుకలదే విజయం.

ఇదే సమయంలో మాషా వాళ్ళ అమ్మ, థియేటర్లో 'సిండ్రెల్లా' నాటక ప్రదర్శన ఇస్తోంది.

సిండ్రెల్లా బాధపడినప్పుడు ఏడుపు సంగీతం వస్తుంది. సిండ్రెల్లా సంతోషంతో ఉన్నపుడు ఆనందకరమైన సంగీతం వినిపిస్తుంది.

ఇంతలో హఠాత్తుగా థియేటర్ స్టేజ్ మీదకు ముక్కున గాజు పూలగుత్తిని కరుచుకుని ఓ చింపిరి పిచుక వచ్చింది. ప్రేక్షకులు ఆశ్చర్యపోయారు.

సంగీతం నిలిచిపోయింది. హాలు అంతా నిశ్శబ్దం.

పిచుక తన ముక్కున ఉన్న గాజు పూలగుత్తిని 'సిండ్రెల్లా' పాత్రలో నటిస్తున్న మాషా వాళ్ళ అమ్మకు ఇచ్చింది. ఆమె ఆనందంతో దాన్ని తన గౌనుకు తగిలించుకుంది.

ఈ దృశ్యాన్ని చూసి మాషా ఎంతో ఆనందించింది.

చూశారా పిల్లలూ! మేలు మరువని పిచుక ఎంత మంచిపని చేసిందో!


స్వేచ్ఛానువాదం : అనిల్ బత్తుల

m : 81792 73971


ఇంగ్లీష్ : ది రఫ్ఫల్డ్ స్పారో

రచయిత : కాన్‌స్టాంటిన్ పాస్తోవ్‌స్కీ

ఇంగ్లీష్ అనువాదం : ఫైన్న గ్లాగోలెవ

కథ

# రాము నేర్చుకున్న పాఠం



అనగనగా ఒక పెద్ద అడవిలో రాము అనే చిన్న కోతి ఉండేది. అది చాలా చురుకుగా ఉండేది. ప్రతి రోజు తన స్నేహితులతో చెట్లపై దూకుతూ, ఆటలు ఆడుతూ, పండ్లు తింటూ సంతోషంగా గడిపేది. కానీ దానికి ఒక చెడు అలవాటు ఉండేది. ఏ పనినైనా "రేపు చేస్తాను" అని వాయిదా వేసేది.

ఒక రోజు అడవిలోని పెద్ద కోతులు అందరినీ పిలిచి, "త్వరలో వర్షాకాలం వస్తుంది. అప్పుడైతే బయటకు వెళ్లి ఆహారం తెచ్చుకోవడం కష్టం. కాబట్టి ఇప్పటి నుంచే పండ్లు, గింజలు సేకరించి దాచుకోండి," అని చెప్పాయి.

అందరూ పెద్దల మాట విని ఆహారం సేకరించడం ప్రారంభించారు. కానీ రాము మాత్రం వారి మాటలను పట్టించుకోకుండా తన స్నేహితులతో ఆడుకుంటూనే ఉండిపోయింది. "ఇంకా చాలా రోజులు ఉన్నాయి. తర్వాత చూసుకుందాం," అని అనుకుంది.

కొన్ని రోజుల తర్వాత భారీ వర్షాలు మొదలయ్యాయి. గాలి బలంగా వీచింది. చెట్లన్నీ తడిసిపోయాయి. బయటకు వెళ్లి ఆహారం వెతకడం చాలా కష్టమైంది. రాముకు చాలా ఆకలి వేసింది. కానీ దాని దగ్గర తినడానికి ఏమీ లేదు.

అప్పుడు పక్కింటి కోతులు రాము పరిస్థితిని చూసి, తమ దగ్గర దాచుకున్న పండ్లు, గింజలను ప్రేమగా పంచుకున్నాయి. వారి సహాయం చూసి రాము చాలా సంతోషించింది. తన తప్పు తెలుసుకుని, "ఇకపై పెద్దల మాట తప్పకుండా వింటాను. ప్రతి పనిని సమయానికి చేస్తాను," అని నిర్ణయించుకుంది.

ఆ రోజు నుంచి రాము కష్టపడి పని చేయడం, భవిష్యత్తు కోసం ముందుగానే సిద్ధం కావడం నేర్చుకుంది. అడవిలోని కోతులందరూ రామును మెచ్చుకున్నారు.

నీతి: సమయానికి చేసిన పని ఎప్పుడూ మనకు మేలు చేస్తుంది. పెద్దల మాట వినడం మనకు మంచి మార్గం చూపుతుంది.

– ఎ. నవనీత్ గౌడ్
7వ తరగతి, మాస్టర్ మైండ్ స్కూలు
గైడ్ టీచర్ : సాయిశర్మ
m : 94916 75130

# భారతదేశ యాత్రలో హ్యూయాన్ సాంగ్‌ను కదిలించిన దృశ్యం

చైనా యాత్రికుడు హ్యూయాన్ సాంగ్ తన భారత దేశ యాత్ర ముగించుకున్నాడు. సముద్ర మార్గం ద్వారా తన దేశానికి తిరిగి వెళుతున్నాడు. ఆ సమయంలో జరిగిన సంఘటన ఇది. కొందరు భారతీయ యువకులు ఆ సమయంలో నావపై హ్యూయాన్ సాంగ్ వెంట ఉన్నారు. వారు తీసుకుని వెళుతున్న సామానులలో విలువైన భారతీయ ప్రాచీన గ్రంథాలు కూడా ఉన్నాయి. అవి భారతీయ సంస్కృతికి భాండాగారాలు. నావ తుఫానులో చిక్కుకుంది. నావలోకి నీరు రాసాగింది. నావలోని వారందరు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని కూర్చున్నారు. నావలో బరువును వెంటనే తగ్గించాలి. హుయాన్ సాంగ్ ఆత్మ రక్షణకు నావలో ఉన్న విలువైన గ్రంథాలు అన్నిటినీ సముద్రంలోకి తోసేయాలనే ఆలోచన చెప్పాడు హ్యూయాన్ సాంగ్. అప్పుడు భారతీయ యువకులలో ఒక వ్యక్తి ఆత్మవిశ్వాసం నిండిన కంఠంతో ఇలా అన్నాడు. “లక్షలాది సంవత్సరాలు కృషి ఫలితమైన ఈ గ్రంథరాశి భారతీయుల అమూల్య సంపద. ఈ విజ్ఞాన జ్యోతులను దేశవిదేశాలలో భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను గొప్పదనాన్ని చాటి చెప్పే మాణిక్యాలు. అజ్ఞాన అంధకారంలో ఉన్న కోట్లాది మానవ హృదయాలను ప్రభావితం చేయటానికి బయలుదేరి వెళుతున్నాయి. ఈ నిధిని సముద్రం పాలు చేయడానికి వీలులేదు” అన్నాడు. ‘జై సంస్కృతీ మాతా!’ అని నినాదం చేస్తూ సముద్రపు అలల ఒడిలోకి దూకాడు. నావలో బరువును తగ్గించేందుకు ఆ యువకులందరూ. ఒకరి తరువాత ఒకరు నీళ్ళలోకి దూకారు. సముద్రంలో కలిసిపోయారు. తమ సంస్కృతీ భాండాగారాన్ని రక్షించుకున్నారు. ఇదంతా హ్యూయాన్ సాంగ్ దిగ్భ్రాంతితో చూస్తూ ఉండి పోయాడు. భారత దేశంలో తాను చూసిన అత్యంత ప్రభావం చూపిన సంఘటనగా హ్యూయాన్ సాంగ్ తన యాత్రా చరిత్రలో రాసుకున్నాడు.

– ‘బాల కథా సౌరభం’ నుండి...



చరిత్ర పాఠాలు-19



# వేయిన్నర ఏండ్ల కిందటి సామాజిక పరిస్థితులు

క్రీ.శ. 4–6 శతాబ్దాల మధ్య తెలంగాణ నుంచి యావత్ దక్కన్ ప్రాంతాన్ని పాలించిన విష్ణుకుండులు 'దానమానాదులచే అనురక్తమగు వర్ణాశ్రమ స్వజన పరిజనులైనవారు' అని తమ శాసనాల్లో ప్రకటించుకున్నారు. గోవిందవర్మ వర్ణాశ్రమ ధర్మాన్ని గౌరవించేవాడట. ఇలా వారు చతుర్వర్ణాల ప్రజలు (బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర కులాలు) తమ తమ వృత్తి ధర్మాలను పాటించే విధంగా ప్రయత్నం చేశారు.

అయితే, మొదటి రెండు కులాలకు సమాజంలో ఎక్కువ గౌరవముండేదని స్పష్టమౌతుంది. విష్ణుకుండులలో కొందరు 'పరమ 'బ్రాహ్మణ్య' అని బిరుదు వహించడం, 'బ్రహ్మక్షత్ర తేజస్సు'ను ధరించడం, 'హిరణ్యగర్భ' యాగం చేసి ఆ బిరుదు ధరించడం మొదలైనవి బ్రాహ్మణ, క్షత్రియ వర్గాల ప్రాముఖ్యాన్ని తెలియచేస్తాయి. అంటే, శూద్రులైన విష్ణుకుండులు అనేక యాగాలు చేసి పై కులాల స్థాయికి పాకినట్లు స్పష్టమవుతుంది. బ్రాహ్మణులకు అనేక అగ్రహారాలిచ్చారు. కులీనులకు కూడా పదవులిచ్చి గౌరవించారు.

వైశ్యులు స్వదేశీ, విదేశీ వ్యాపారాల్లో నిమగ్నమై ఉండేవారు. శూద్రుల్లో కంసాలివారు, శిల్పులు, చేనేత పనివారు మొదలైన వారికి సమాజంలో సముచిత స్థానం ఉండేది. రైతుల కృషి దేశానికి వెన్నెముక కాబట్టి కొందరు రైతులక్కూడా రాజన్యులు అగ్రహారాలను మాన్యాలతోపాటు దానం చేసేవారు. దాసీదాస జనాలను కూడా వేల సంఖ్యలో దానం చేసేవారట. వీరి వల్ల వ్యవసాయాభివృద్ధి, వ్యాపారాభివృద్ధి జరిగేదేమో కాని, వారి మానవ హక్కులను మాత్రం (ఈనాటి పరిస్థితుల్లో) కాలరాచినట్లే అర్థమౌతుంది. పురుష మేధాలు (యాగాల్లో పురుషులను బలివ్వడం) కూడా చేసిన ఆ రోజుల్లో దాసీదాసులను దానమివ్వడం పెద్ద లెక్క కాదేమో! అయితే విష్ణుకుండులు చేసిన కన్యా దానాల వల్ల కన్యల తల్లిదండ్రులు, అత్త మామలు, వధూవరులు అందరూ సంతోషించేవారనే చెప్పాలి. విష్ణుకుండులు శయన, ఆసన, యాన, పాన, భోజన, భవన, వసన, ఆభరణాలను కూడా దానం చేసేవారట. ఇలా ఆ రాజులు చేసిన అనేక దానాలు ప్రజలకు సంతోషాన్ని కల్గించడమే కాక, ప్రజల్లో కూడా తమకు కలిగి ఉన్నంత మేరలో దానం చేసే సంస్కృతిని వ్యాపింపచేసి ఉంటాయి. మాధవవర్మ తన తల్లిదండ్రుల పాదాలను నిరంతరం సేవించేవాడట. దీన్ని బట్టి ఆనాటి ప్రజలు తల్లిదండ్రులు, పెద్దల పట్ల భయభక్తులు కలిగి ఉండేవారని చెప్పవచ్చు.

– డా. ద్యావనపల్లి సత్యనారాయణ
m : 9490957078

## 1 సరైన సంఖ్యను కనుగొనండి

ప్రతి వరుసలో ఉన్న సంఖ్యల నియమాన్ని గుర్తించి, ఖాళీలో సరైన సంఖ్యను రాయండి.


| | | | | | |
|---|---|---|---|---|---|
| 2 | 4 | 8 | 16 | ? | 1 |
| 5 | 10 | 15 | 20 | ? | 2 |
| 1 | 4 | 9 | 16 | ? | 3 |
| 3 | 6 | 12 | 24 | ? | 4 |




1=32, 2=25, 3=25, 4=48

## 2 ఏది భిన్నంగా ఉంది?

ప్రతి వరుసలో నాలుగు చిత్రాలు ఉన్నాయి. వాటిలో మిగిలిన వాటికి భిన్నంగా ఉన్న చిత్రాన్ని గుర్తించి, దాని కింద వర్ణానికి (✓) గుర్తు పెట్టండి.







# కలంచెలిమి



**మెరుగు సుచిప్రియ**
8వ తరగతి ప్రాథమికోన్నత పాఠశాల,
అంబం, ఎడపల్లి, నిజామాబాద్.



**చి.ధనుష్**
6వ తరగతి, M.P.U.P. పాఠశాల,
తెన్ను బొడ్డవర, విజయనగరం జిల్లా.

**వావిళ్ల నాగేష్**
9వ తరగతి, జడ్.పి.హెచ్.ఎస్,
ఒడిపిలవంచ, మం. కాటారం
జి. జయశంకర్ భూపాలపల్లి



**నర్ర అద్వైత**
7వ తరగతి, శ్రీ చైతన్య పాఠశాల,
చింతకుంట, కరీంనగర్, తెలంగాణ





**హిమశ్రీ**
9వ తరగతి, TGMS
నామాపూర్



**ఎ. మారుతి**
7వ తరగతి, కరణం చిక్కప్ప
ప్రభుత్వ ఉన్నత పాఠశాల,
కళ్యాణదుర్గం, అనంతపురం

కథ

# పిచ్చుకమ్మ గూడు నా బుజ్జి నేస్తం




మా ఇల్లు పాత పెంకుటిల్లు. మా ఇంటి వసారాలో ఒక పెద్ద అద్దం ఉండేది. ఒకరోజు ఎక్కడి నుండి వచ్చిందో గానీ, ఒక బుజ్జి పిచుకమ్మ ఆ అద్దం మీద కూర్చుని 'కిచకిచ' మంటూ అరుస్తోంది. అది అద్దంలో తనని తానే చూసుకుంటూ, ఇంకో పిచుక అనుకుని ముక్కుతో పొడుస్తోంది. అది చూసి నాకు భలే నవ్వొచ్చింది. మెల్లగా ఆ పిచుకమ్మ మా ఇంటి దూలం మీద గడ్డి పరకలతో గూడు కట్టడం మొదలుపెట్టింది. మా అమ్మ తిడుతుందేమో అని భయం వేసింది కానీ, అమ్మ ఏమీ అనలేదు. పిచుకలు గూడు కడితే ఇంటికి మంచిదిరా అని చెప్పింది. నేను రోజూ ఆ పిచుకమ్మ ఏం చేస్తుందో అని కనిపెట్టుకుని ఉండేవాడిని. దానికి దాహం వేస్తుందని ఒక చిన్న మూకుడులో నీళ్ళు, కొంచెం బియ్యం గింజలు పెట్టేవాడిని.

కొన్ని రోజుల తర్వాత ఆ గూట్లో నుండి 'చీయ్.. చీయ్..' అని సన్నని అరుపులు వినిపించాయి. లోపల బుజ్జి పిల్లలు పుట్టాయని నాకు అర్థమైపోయింది. పిచుకమ్మ రోజూ బయటకు వెళ్లి పురుగులను తెచ్చి ఆ పిల్లలకు తినిపించేది. ఒకరోజు సాయంత్రం పిచుకమ్మ బయటకు వెళ్ళింది. సరిగ్గా అప్పుడే మా వీధిలో తిరిగే ఒక నల్ల పిల్లి మెల్లగా గోడ దూకి వసారాలోకి వచ్చింది. ఆ పిల్లి కళ్లు దూలం మీద ఉన్న గూడు వైపు ఉన్నాయి. అది మెల్లగా దూలం పైకి ఎక్కాలని చూస్తోంది. నాకైతే గుండె ఆగిపోయినంత పని అయింది. "అయ్యో! నా బుజ్జి పిచుక పిల్లల్ని ఆ పిల్లి తినేస్తుందేమో" అని కంగారు పడ్డాను. ఇంట్లో ఎవరూ లేరు. నేనే ఏదో ఒకటి చేయాలి అని గట్టిగా కేకలు వేస్తూ పక్కనే ఉన్న ఖాళీ డబ్బాను కర్రతో కొట్టాను. ఆ శబ్దానికి పిల్లి భయపడి ఒకే ఉదుటన గోడ దూకి పారిపోయింది.

కాసేపటికి పిచుకమ్మ తిరిగి వచ్చింది. నేను చేసిన గొడవ చూసి అది కూడా కొంచెం భయపడింది. కానీ, పిల్లి పారిపోవడం చూసి అది గూటి మీద కూర్చుని హాయిగా రెక్కలు ఆడిస్తూ పాట పాడింది. నాకైతే అది నాకు థాంక్యూ చింటూ! అని చెబుతున్నట్టే అనిపించింది. కొన్నాళ్లకు ఆ పిచుక పిల్లలు పెద్దవయ్యాయి. అవి రెక్కలు విప్పుకుని ఆకాశంలోకి ఎగిరిపోతుంటే నాకు కొంచెం బాధగా ఉన్నా, అవి స్వేచ్ఛగా ఎగురుతున్నందుకు చాలా సంతోషం వేసింది. ఆ రోజు నుండి మా ఇంటికి పిచుకలు రావడం ఎక్కువైంది. మా ఇంటి వసారా ఇప్పుడు ఒక చిన్న పక్షుల అడవిలా మారిపోయింది.

మనం చిన్న ప్రాణుల మీద జాలి చూపిస్తే, అవి మనల్ని ఎంతో నమ్ముతాయి. మూగ జీవాలకు మనం ఇచ్చే చిన్న సాయం కూడా వాటికి పెద్ద ప్రాణదానం అవుతుంది.

– కె. మోక్షిత
6వ తరగతి, అంబం, ఎడపల్లి, నిజామాబాద్.
గైడ్ టీచర్ : బొడ్డు భరద్వాజ్
m : 94408 88870

## మ్యాథ్స్ ట్రిక్స్

# ముందుగా జవాబు - 3

1. ప్రేక్షకులలోనుండి ఒకరు ఒక సంఖ్యను మీకు చెప్పాలి. ఎన్ని అంకెలైనా ఉండవచ్చు.
2. అది విని మీరు ఒక స్లిప్ పై రహస్యంగా జవాబు రాసి ఒక కవర్‌లో ఉంచి వారికి ఇవ్వాలి.
3. తర్వాత మరో మూడు సంఖ్యలను చెప్పమనాలి.
4. తర్వాత మీరు మూడు సంఖ్యలు చెప్పాలి.
5. ఇప్పుడు ఆ ఏడు సంఖ్యలను కూడగా ముందుగా వేసిన జవాబుకు సరిపోతుంది.

ఉదా: ప్రేక్షకుడు 87697 అని చెప్పాడు.

మీరు 387694 రహస్యంగా రాసి కవర్లో పెట్టారు.

| | |
|---|---|
| 87697 | మొదట రాసినది. |
| 48760 | |
| 87952 | వారు చెప్పినవి |
| 31279 | |
| 51239 | |
| 1047 | మీరు చెప్పినవి |
| 68720 | |
| 387694 | మొత్తము |

రహస్యము: మొదట చెప్పిన సంఖ్య నుండి 3 తీసివేయగా వచ్చిన జవాబుకు ముందు 3 రాయాలి. అదే ఆ ఏడు సంఖ్యల మొత్తం అవుతుంది.

87697 – 3 = 87697

387694

2,3,4 వరుసలకు ఎంత కలిపితే 9 వస్తుందో ఆ బేధాలను వరుసగా 5,6,7 సంఖ్యలుగా మీరు చెప్పాలి.

– అంకెల మామయ్య చంద్రయ్య
m: 9440926937

## బాలచెలిమి క్లబ్

## చెలిమి క్లబ్

చెలిమిక్లబ్‌లో సభ్యత్వం తీసుకోండి
లాభాలు పొందండి.

1. చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రచురించే పుస్తకాలపై ప్రత్యేక తగ్గింపు.
2. మీ ప్రతి పుట్టిన రోజుకు అభినందనలతో అందమైన గ్రీటింగ్ కార్డు.
3. మీలో ఉన్న టాలెంట్‌ను అభివృద్ధి చేసుకోవడానికి క్లబ్ నిర్మాణాత్మక సహకారం అందిస్తుంది.
4. మీ స్కూల్లో, ఊర్లో పిల్లల కార్యక్రమాల వార్తలను చెలిమి సమాచార పత్రికకు పంపడానికి మీరు విలేఖరిగా ఉండవచ్చు.
5. అందమైన మెంబర్‌షిప్ బ్యాడ్జి.
6. మిమ్మల్ని ఆశ్చర్యపరచే బహుమతులు.

### చెలిమి క్లబ్

పేరు : ---------------

తండ్రి పేరు : ---------------

పుట్టినతేదీ : ---------------

చిరునామా : ---------------

-------------------

-------------------

పిన్ : ---------------

హాబీలు : ---------------

మొబైల్ : ---------------

ఇ-మెయిల్ : ---------------

ఈ వివరాలతో మెయిల్ చేయండి.

బాల చెలిమి ఇ-మెయిల్ :
desk. chelimi@gmail. com






వైద్య రంగంలో కృత్రిమ మేధస్సు వినియోగం ఆధునిక ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు దారితీస్తోంది. కంప్యూటర్లు మానవుల మాదిరిగా సమాచారాన్ని గ్రహించి, విశ్లేషించి, నిర్ణయాలకు సహకరించగలవా అనే ఆలోచనతో 1950-1960 దశకాల్లో కృత్రిమ మేధస్సు పరిశోధనలు ప్రారంభ మయ్యాయి. అనంతరం వైద్యులకు వ్యాధుల నిర్ధారణలో సహాయపడే ప్రత్యేక కంప్యూటర్ వ్యవస్థలను రూపొందించే ప్రయత్నాలు జరిగాయి. 1970వ దశకంలో అమెరికాలోని స్టాన్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో అభివృద్ధి చేసిన 'మైసిన్' వ్యవస్థ ఈ రంగంలో ఒక ముఖ్యమైన ముందడుగుగా నిలిచింది. కొన్ని అంటువ్యాధులను గుర్తించి, వాటికి అవసరమైన చికిత్సను సూచించేందుకు దీనిని రూపొందించారు.

అమెరికాలోని స్టాన్‌ఫర్డ్, మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వంటి విద్యాసంస్థలు కృత్రిమ మేధస్సు, వైద్య సాంకేతికతల అభివృద్ధిలో ప్రధాన పాత్ర పోషించాయి. తరువాత యూరప్, జపాన్, చైనా, భారత్‌తోపాటు ప్రపంచవ్యాప్తంగా ఈ పరిశోధనలు విస్తరించాయి. నేడు ఆసుపత్రులు, ప్రయోగశాలలు, ఔషధ తయారీ సంస్థలు, వైద్య పరిశోధనా కేంద్రాల్లో కృత్రిమ మేధస్సును విస్తృతంగా వినియోగిస్తున్నారు.

రోగుల వైద్య చరిత్ర, పరీక్షల ఫలితాలు, రక్తపోటు, గుండె వేగం, శరీర ఉష్ణోగ్రత, మందులకు స్పందించే విధానం వంటి సమాచారాన్ని కృత్రిమ మేధస్సు వేగంగా విశ్లేషిస్తుంది. ఈ సమాచారంలో కనిపించే ప్రత్యేక నమూనాలు, అసాధారణ మార్పులను గుర్తించి వైద్యులకు అవసరమైన సూచనలు అందిస్తుంది. దీనివల్ల కొన్ని వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి, సకాలంలో చికిత్స ప్రారంభించే అవకాశం కలుగుతుంది.

ఎక్స్‌రే, సీటీ స్కాన్, ఎంఆర్ఐ, అల్ట్రాసౌండ్ వంటి వైద్య చిత్రాల పరిశీలనలో కృత్రిమ మేధస్సు ముఖ్యమైన సహాయక సాధనంగా మారింది. వేలాది వైద్య చిత్రాల ద్వారా శిక్షణ పొందిన సాఫ్ట్‌వేర్ కొత్త చిత్రాన్ని పరిశీలించి అనుమానాస్పద ప్రాంతాలను గుర్తిస్తుంది. క్యాన్సర్, ఊపిరితిత్తుల వ్యాధులు, మెదడు సమస్యలు, కంటి వ్యాధులు, ఎముకల గాయాలను గుర్తించడంలో ఇది వైద్యులకు సహాయపడుతుంది. అయితే కృత్రిమ మేధస్సు ఇచ్చే ఫలితాలను నిపుణులైన వైద్యులు పరిశీలించిన తరువాతే తుది నిర్ధారణ చేస్తారు.

కొత్త ఔషధాల అభివృద్ధిలోనూ కృత్రిమ మేధస్సు కీలకంగా పనిచేస్తోంది. వివిధ రసాయన సమ్మేళనాలు, వ్యాధులకు సంబంధించిన జీవసంబంధ సమాచారం, గత పరిశోధనల ఫలితాలను తక్కువ సమయంలో విశ్లేషించి, ఉపయోగపడగల ఔషధ సమ్మేళనాలను గుర్తిస్తుంది. దీనివల్ల ఔషధ పరిశోధనకు అవసరమైన సమయం, వ్యయం కొంతవరకు తగ్గే అవకాశం ఉంటుంది.

రోబోటిక్ శస్త్రచికిత్సలో అత్యంత సూక్ష్మమైన కదలికలను నియంత్రిస్తూ వైద్యులు అధిక ఖచ్చితత్వంతో చికిత్స చేయగలుగుతున్నారు. టెలిమెడిసిన్ ద్వారా మారుమూల ప్రాంతాల్లోని రోగులు కూడా వీడియో కాల్‌లో వైద్యులను సంప్రదించవచ్చు. స్మార్ట్‌వాచ్‌ల వంటి ధరించగలిగే పరికరాలు గుండె వేగం, నిద్ర, వ్యాయామం, రక్తంలో ఆక్సిజన్ స్థాయి వంటి వివరాలను నమోదు చేస్తాయి. డిజిటల్ ఆరోగ్య సహాయకులు వైద్య నియామకాలు, మందులు తీసుకునే సమయాలు, ఆరోగ్య పరీక్షలను గుర్తుచేస్తారు. వ్యక్తిగతీకరించిన వైద్యంలో రోగి వయస్సు, ఆరోగ్య పరిస్థితి, జన్యు సమాచారం ఆధారంగా అనుకూలమైన చికిత్సను ఎంపిక చేయడంలో కృత్రిమ మేధస్సు తోడ్పడుతుంది.

కృత్రిమ మేధస్సు వైద్యుల పనిభారాన్ని తగ్గించి, వేగవంతమైన నిర్ణయాలకు సహకరించినప్పటికీ అది వైద్యుడికి ప్రత్యామ్నాయం కాదు. రోగుల సమాచార భద్రత, ఫలితాల విశ్వసనీయత, నైతిక ప్రమాణాలు ఎంతో ముఖ్యమైనవి. వైద్యుల జ్ఞానం, అనుభవం, మానవీయ దృక్పథానికి తోడ్పడే శక్తిమంతమైన సాధనంగానే కృత్రిమ మేధస్సును బాధ్యతాయుతంగా ఉపయోగించాలి.

– లత
e: ogshydcbse@gmail. com




రచన, బొమ్మలు : చింతల శ్రీనివాస్ గుప్త
నిజామాబాద్, M: 94400 37125




– దేవులపల్లి సారిక రమేశ్
సిద్దిపేట, నంగునూర్, m : 9963701294

# చీమ - పావురం



ఒక అడవిలో ఒక చిన్న చీమ నివసించేది. అది చాలా కష్టపడి పనిచేసే స్వభావం కలిగి ఉండేది. ప్రతిరోజూ ఆహారం సేకరించుకొని తన గూటికి తీసుకెళ్లేది. అదే అడవిలో ఒక పెద్ద చెట్టుపై ఒక పావురం కూడా నివసించేది. అది దయగలది, ఇతరులకు సహాయం చేయడంలో ఎప్పుడూ ముందుండేది.

ఒక రోజు చీమకు చాలా దాహం వేసింది. నీరు తాగడానికి సమీపంలోని నది ఒడ్డుకు వెళ్లింది. నది ప్రవాహం వేగంగా ఉంది. చీమ నీరు తాగుతుండగా అకస్మాత్తుగా కాలుజారి నదిలో పడిపోయింది. చిన్నదైన చీమకు ఈదడం రాకపోవడంతో ప్రవాహంలో కొట్టుకు పోతూ ప్రాణభయంతో సహాయం కోసం అరిచింది.

అదే సమయంలో చెట్టుపై కూర్చున్న పావురం చీమ ఆపదను గమనించింది. చీమను రక్షించాలని వెంటనే నిర్ణయించుకుంది. చెట్టు నుండి ఒక పెద్ద ఆకును తెంపి నదిలో వేసింది. ఆ ఆకు చీమ దగ్గరకు తేలుతూ వచ్చింది. చీమ తన శక్తినంతా ఉపయోగించి ఆ ఆకుపైకి ఎక్కింది. కొద్దిసేపటికి ఆ ఆకు ఒడ్డుకు చేరుకుంది. చీమ సురక్షితంగా బయటపడింది.

ప్రాణాపాయం నుండి రక్షించిన పావురానికి చీమ హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలిపింది. “నీ మేలు నేను ఎప్పటికీ మరచిపోను. అవకాశం వచ్చినప్పుడు తప్పకుండా నీకు సహాయం చేస్తాను” అని చెప్పింది.

కొన్ని రోజుల తరువాత ఒక వేటగాడు ఆ అడవికి వచ్చాడు. చెట్టుపై కూర్చున్న పావురాన్ని చూసి దానిని వేటాడాలని నిర్ణయించుకున్నాడు. విల్లు బాణం సిద్ధం చేసుకొని పావురంపై గురి పెట్టాడు. ఆ దృశ్యాన్ని దగ్గరలో ఉన్న చీమ గమనించింది. పావురం ప్రమాదంలో ఉందని అర్థం చేసుకుంది.

తన మిత్రుడుని కాపాడాలని నిర్ణయించిన చీమ వెంటనే వెళ్లి వేటగాడి కాలిని గట్టిగా కుట్టింది. అకస్మాత్తుగా నొప్పి కలగడంతో వేటగాడు కేక వేసి కదిలిపోయాడు. ఫలితంగా అతని గురి తప్పిపోయింది. బాణం పావురాన్ని తాకలేదు. శబ్దం విని పావురం ప్రమాదాన్ని గుర్తించి వెంటనే ఆకాశంలోకి ఎగిరిపోయింది.

పావురం తన ప్రాణాలను కాపాడిన చీమకు కృతజ్ఞతలు తెలిపింది. ఇద్దరూ సంతోషంగా ఒకరినొకరు అభినందించుకున్నారు. ఆ రోజు నుండి వారి స్నేహం మరింత బలపడింది.

### ఈ కథలోని సైన్స్ ఏమిటి?

### 1) ఆకు నీటిలో ఎందుకు తేలుతుంది?

ఆకు నీటిలో తేలడానికి ప్రధాన కారణం దాని సాంద్రత (Density) నీటి సాంద్రత కంటే తక్కువగా ఉండటం. ఆకులో చిన్న చిన్న గాలి ఖాళీలు ఉంటాయి. ఈ గాలి కారణంగా ఆకు తేలికగా ఉంటుంది. అలాగే నీరు ఆకుపై తేలింపు బలం (Buoyant Force) ప్రయోగిస్తుంది. ఈ తేలింపు బలం ఆకును పైకి నెట్టడంతో ఆకు నీటిపై తేలుతుంది.

**2) చీమ కుట్టితే ఎందుకు నొప్పి కలుగుతుంది?**

చీమ కుట్టినప్పుడు దాని దవడలతో చర్మాన్ని గట్టిగా పట్టుకొని, కొన్ని జాతుల చీమలు ఫార్మిక్ ఆమ్లం (Formic Acid) అనే రసాయనాన్ని విడుదల చేస్తాయి. ఈ ఆమ్లం చర్మంలోని నరాల చివరలను ఉత్తేజ పరుస్తుంది. అందువల్ల మెదడుకు నొప్పి సంకేతాలు చేరి మనకు నొప్పి, మంట లేదా దురద అనిపిస్తాయి.

**3) నది ఎందుకు ప్రవహిస్తుంది?**

నది నీరు ఎత్తైన ప్రదేశాల నుంచి తక్కువ ఎత్తు ఉన్న ప్రదేశాల వైపు భూమి గురుత్వాకర్షణ శక్తి (Gravity) వల్ల ప్రవహిస్తుంది. వర్షాలు, మంచు కరుగుదల, కొండలలోని ఊటలు నదులకు నీటిని అందిస్తాయి. గురుత్వాకర్షణ ప్రభావంతో నీరు సముద్రం వైపు కదులుతూ నదిగా ప్రవహిస్తుంది.

**4) పూర్వం పావురాల ద్వారా ఉత్తరాలు పంపేవారు – నిజమా?**

అవును, ఇది నిజం. పూర్వకాలంలో సందేశ పావురాలు (Carrier Pigeons) ఉపయోగించి ఉత్తరాలు పంపేవారు. ఈ పావురాలకు తమ గూటి స్థానం గుర్తుంచుకునే ప్రత్యేక సామర్థ్యం ఉంటుంది. చిన్న కాగితంపై సందేశం రాసి పావురం కాలికి కట్టేవారు. పావురం తన గూటికి ఎగిరి వెళ్లినప్పుడు ఆ సందేశం కూడా చేరేది. టెలిఫోన్, ఇంటర్నెట్ లేని కాలంలో యుద్ధాలు మరియు అత్యవసర సమాచార మార్పిడిలో ఇవి చాలా ఉపయోగపడేవి.



**కొస మెరుపు:**

1918లో జరిగిన మొదటి ప్రపంచ యుద్ధంలో "Cher Ami" అనే సందేశ పావురం 12 ముఖ్యమైన సందేశాలను విజయవంతంగా చేరవేసి అనేక మంది సైనికుల ప్రాణాలను కాపాడింది.

– కె శ్రీకృష్ణ సాయి
రేవతి సైన్స్ ఫౌండేషన్ (రామచంద్రపురం)
m : 9866130320

## సామెతలు

- అందలుంటే కొండలు దాటవచ్చు.
- ఆరిపోయే దీపానికి వెలుగు ఎక్కువ.
- ఇంటి దొంగను ఈశ్వరుడైనా పట్టలేడు.
- ఏరుదాటి తెప్ప తగులబెట్టినట్లు.
- కంటికి రెప్ప, కాలికి చెప్పు.
- కుక్క తోక పట్టుకొని, గోదావరి ఈదినట్లు.
- గంగలో మునిగినా కాకి హంస అవుతుందా?
- చదువు వేస్తే ఉన్న మతి పోయినట్లు.
- జింకకు కొమ్ములు బరువా?
- ఢిల్లీకి రాజైనా తల్లికి కొడుకే.

– బాలచెలిమి డెస్క్

# తెలంగాణ నదీ వ్యవస్థ – ప్రధాన ప్రాజెక్టులు




తెలంగాణ భూభాగంలో ఎక్కువ భాగం గోదావరి–కృష్ణా పరీవాహక ప్రాంతాల్లోనే ఉంది. ఈ ప్రాజెక్టులు సాగునీరు, తాగునీరు, జలవిద్యుత్, వరద నియంత్రణతో పాటు రాష్ట్ర వ్యవసాయ–ఆర్థికాభివృద్ధికి జీవనాధారంగా నిలుస్తున్నాయి.

ప్రధాన నదులు: గోదావరి, కృష్ణా.

గోదావరి ముఖ్య ఉపనదులు:మంజీర, ప్రాణహిత, మానేరు, కడెం, పెన్‌గంగ, వార్ధా, కిన్నెరసాని, తాలిపేరు


కృష్ణా ముఖ్య ఉపనదులు:భీమా, తుంగభద్ర, దిండి, మూసీ, పాలేరు, మున్నేరు

రాష్ట్రంలోని ముఖ్యమైన నదులు, ఉపనదులు, వాటిపై నిర్మించిన ప్రధాన ప్రాజెక్టుల వివరాలు:

| నదీ పరీవాహక ప్రాంతం | నది/ఉపనది | ప్రధాన ప్రాజెక్టు | ప్రాంతం/జిల్లా | ప్రధాన ప్రయోజనం |
|---|---|---|---|---|
| గోదావరి | గోదావరి | శ్రీరాంసాగర్ ప్రాజెక్టు (SRSP) | పోచంపాడ్, నిజామాబాద్ | సాగునీరు, తాగునీరు |
| గోదావరి | గోదావరి | శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు | మంచిర్యాల–పెద్దపల్లి | సాగునీరు, తాగునీరు, పారిశ్రామిక అవసరాలు |
| గోదావరి | గోదావరి | కాళేశ్వరం ఎత్తిపోతల పథకం | జయశంకర్ భూపాలపల్లి | సాగునీరు, తాగునీరు, జలాశయాల నింపడం |
| గోదావరి | గోదావరి | జె. చొక్కారావు దేవాదుల | ములుగు–వరంగల్ ప్రాంతం ఎత్తిపోతల పథకం | కరవు ప్రాంతాలకు సాగునీరు |
| గోదావరి | గోదావరి | సీతారామ ఎత్తిపోతల పథకం | భద్రాద్రి కొత్తగూడెం | సాగునీరు, తాగునీరు |
| గోదావరి | మంజీర | నిజాంసాగర్ ప్రాజెక్టు | కామారెడ్డి | సాగునీరు, తాగునీరు |
| గోదావరి | మంజీర | సింగూరు ప్రాజెక్టు | సంగారెడ్డి | హైదరాబాద్‌కు తాగునీరు, సాగునీరు |
| గోదావరి | ప్రాణహిత | తుమ్మిడిహట్టి ప్రాజెక్టు | కుమురం భీమ్ ఆసిఫాబాద్ | ఎత్తిపోతల ద్వారా సాగునీరు |
| గోదావరి | కడెం | కడెం నారాయణరెడ్డి ప్రాజెక్టు | నిర్మల్ | సాగునీరు, వరద నియంత్రణ |
| గోదావరి | మానేరు | ఎగువ మానేరు ప్రాజెక్టు | రాజన్న సిరిసిల్ల | సాగునీరు |
| గోదావరి | మానేరు | మధ్య మానేరు ప్రాజెక్టు | రాజన్న సిరిసిల్ల | సాగునీరు, నీటి నిల్వ |
| గోదావరి | మానేరు | దిగువ మానేరు ప్రాజెక్టు | కరీంనగర్ | సాగునీరు, తాగునీరు |

| | | | | |
|---|---|---|---|---|
| గోదావరి | కిన్నెరసాని | కిన్నెరసాని ప్రాజెక్టు | భద్రాద్రి కొత్తగూడెం | సాగునీరు, విద్యుత్, పారిశ్రామిక అవసరాలు |
| గోదావరి | పాలేరు వాగు | పాలేరు జలాశయం | ఖమ్మం | సాగునీరు, తాగునీరు |
| గోదావరి | వైరా | వైరా ప్రాజెక్టు | ఖమ్మం | సాగునీరు |
| కృష్ణా | కృష్ణా | ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు | జోగులాంబ గద్వాల | సాగునీరు, జలవిద్యుత్ |
| కృష్ణా | కృష్ణా | శ్రీశైలం ప్రాజెక్టు | నాగర్‌కర్నూల్-నంద్యాల | జలవిద్యుత్, సాగునీరు, తాగునీరు |
| కృష్ణా | కృష్ణా | నాగార్జునసాగర్ ప్రాజెక్టు | నల్గొండ-పల్నాడు | సాగునీరు, తాగునీరు, జలవిద్యుత్ |
| కృష్ణా | కృష్ణా | పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం | నాగర్‌కర్నూల్-రంగారెడ్డి | సాగునీరు, తాగునీరు |
| కృష్ణా | కృష్ణా | మహాత్మా గాంధీ కల్వకుర్తి | నాగర్‌కర్నూల్ ఎత్తిపోతల పథకం | కరవు ప్రాంతాలకు సాగునీరు |
| కృష్ణా | కృష్ణా | జవహర్ నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం | జోగులాంబ గద్వాల | సాగునీరు, తాగునీరు |
| కృష్ణా | కృష్ణా-భీమా ప్రాంతం | రాజీవ్ భీమా ఎత్తిపోతల పథకం | నారాయణపేట-మహబూబ్‌నగర్ | సాగునీరు |
| కృష్ణా | తుంగభద్ర | రాజోలిబండ మళ్లింపు పథకం | జోగులాంబ గద్వాల | సాగునీరు |
| కృష్ణా | పెద్దవాగు | కోయిల్‌సాగర్ ప్రాజెక్టు | మహబూబ్‌నగర్ | సాగునీరు, తాగునీరు |
| కృష్ణా | దిండి | దిండి ప్రాజెక్టు | నల్గొండ | సాగునీరు, తాగునీరు |
| కృష్ణా | కృష్ణా | అలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు | నల్గొండ | సాగునీరు, హైదరాబాద్‌కు తాగునీరు |
| కృష్ణా | మూసీ | మూసీ ప్రాజెక్టు | సూర్యాపేట | సాగునీరు, వరద నియంత్రణ |
| కృష్ణా | మూసీ | ఉస్మాన్‌సాగర్ | హైదరాబాద్-రంగారెడ్డి | తాగునీరు, వరద నియంత్రణ |
| కృష్ణా | ఈసీ-మూసీ ఉపనది | | హిమాయత్‌సాగర్-రంగారెడ్డి | తాగునీరు, వరద నియంత్రణ |

– బాలచెలిమి డెస్క్






# బద్ధకం వదులు హుషారుగా ఉండు

ఒక అందమైన నగరం (ఖమ్మంలో) ఒక పాప ఉంది. ఆ పాప పేరు నిధున. నిధున ఏడవ తరగతి చదువుతుంది. నిధున చాలా తెలివైన, చురుకైన అమ్మాయి. నిధునకి వేసవి సెలవులు రావడం వల్ల ఒక రోజు వాళ్ళ అమ్మమ్మ ఇంటికి వెళ్ళింది. అక్కడ తనకి ఏమి చెయ్యాలో తెలియలేదు. రోజు రోజుకి ఖాళీగా ఉండడం వల్ల బద్ధకం పెరిగింది. రోజంతా ఫోను చూస్తూ గడిపేది. అలాగే కుర్చీలో, మంచంపైన పడుకొని గడిపేది. ఒక రోజు ఫోను రిచార్జు అయిపోవడం వల్ల అమ్మమ్మ దగ్గరకు వెళ్ళి ఇలా చెప్పింది. అమ్మమ్మ నాకు చాలా అలసటగా, బద్ధకంగా ఉంది. ఏ పని చెయ్యబుద్ధి కావడం లేదు అని మూలుగుతూ చెప్పింది. ఇంతకు ముందు ఉన్న హుషారుగా ఇప్పుడు నాకు లేదు ఎందుకు, ఏం చెయ్యాలి అని అడిగింది. అప్పుడు అమ్మమ్మ చిన్నగా నవ్వి నువ్వు నాతో పాటు పొలం దగ్గరకు రా అని, పొలం దగ్గరకు తీసుకొని వెళ్ళింది. ఇలా చూడు ఇక్కడ నీటి గుంట ఉంది. అక్కడ సెలయేరు పారుతూ ఉంది. ఏది నీకు నచ్చింది అని అడిగింది. అమ్మమ్మ అప్పుడు నిధున అమ్మమ్మ నీటి గుంట మురికి వాసన వస్తుంది. అదే సెలయేరు అందంగా తామర పువ్వులతో స్వచ్ఛంగా పారుతూ ఉంది అని చెప్పింది. అవును నీరు కూడా కదలకుండా ఉంటే కుళ్ళిన వాసన వస్తుంది. సెలయేరు ఒక చోటు నుంచి ఇంకో చోటుకి పారుతూ స్వచ్ఛంగా ఉంది. కిలకిలమంటు పక్షులు గెంతుతూ కోతులు, ఇంకా కొన్ని జంతువులు హుషారుగా ఉన్నాయి. అలాగే నువ్వు పట్టణంలో చూసిన జూలో జంతువులు చాలా బద్ధకంగా ఉన్నాయి. మరియు ప్రజల ద్వారా ఆహారాన్ని తింటున్నాయి. నిధునకు అర్థం కాలేదు. సరే అని అమ్మమ్మ అని, నువ్వు తొక్కే సైకిల్‌ని ఒక వారం బయట వదిలేయి. అప్పుడు అది వర్షంకి, ఎండకు తుప్పు పడుతుంది కదా! అదే రోజు తొక్కితే చక్కగా పని చేస్తుంది. అలాగే మనం కూడా మెదడుకు, శరీరానికి పని చెబితే అది హుషారుగా ఉంటుంది. లేకపోతే బద్ధకంగా తయారు అవుతుంది. నిధున ఇంటికి వెళ్ళి, తన అమ్మమ్మ చెప్పిన మాటలు గురించి ఆలోచించి రాత్రంతా నిద్రపోలేదు. ఆమె గురించి చాలా బాధపడింది. తెల్లవారు జామున నిద్ర లేచి మొక్కలతో కొంత సమయం గడిపింది. ఇంక తాను ఎప్పుడు బద్ధకంగా ఉండదు అని వాళ్ళ అమ్మమ్మకు ఓటు వేసింది.

నీతి : అలాగే ఎంతటి మేధావి అయిన మెదడుకు, శరీరానికి పదును పెట్టకపోతే అంటే బద్ధకంగా సోమరితనంగా ఉంటారు. వారి మేధస్సు మొద్దుబారుతుంది. శరీరం బద్ధకంగా తయారవుతుంది. వారి సహజ మెరుపు పోతుంది.

– ఎం. పావ్య నిధున
7వ తరగతి
m : 8179840889

## చిన్న ఆకారం... పెద్ద మనుగడ పోరాటం

# పిగ్మీ హాగ్ – ప్రపంచంలోనే అతి చిన్న అడవి పంది



ప్రపంచంలోనే అతి చిన్న అడవి పందిగా గుర్తింపు పొందిన పిగ్మీ హాగ్ భారతదేశ జీవవైవిధ్య సంపదలో అత్యంత అరుదైన జీవి. దీని శాస్త్రీయ నామం పోర్కులా సాల్వేనియా (Porcula salvania). తెలుగులో దీనిని “మరుగుజ్జు అడవి పంది” అని పిలవవచ్చు. పూర్తిగా ఎదిగిన పిగ్మీ హాగ్ చిన్న కుక్క పరిమాణంలో ఉంటుంది. దీని శరీరం 55 నుంచి 71 సెంటీమీటర్ల పొడవు, భుజాల వద్ద 20 నుంచి 30 సెంటీమీటర్ల ఎత్తు, తోక మూడు సెంటీమీటర్ల పొడవు ఉంటుంది. బరువు సాధారణంగా 6 నుంచి 12 కిలోల మధ్య ఉంటుంది. శరీరంపై ముదురు గోధుమ లేదా నలుపు కలిసిన గరుకైన వెంట్రుకలు ఉంటాయి. ఇది వేగంగా పరుగెత్తగల చురుకైన జంతువు.

హిమాలయ పర్వతాల దిగువన నదుల వరద మైదానాల్లో పెరిగే పొడవైన, తేమతో కూడిన దట్టమైన గడ్డి ప్రాంతాలు దీని సహజ నివాసాలు. ఒకప్పుడు ఉత్తరాఖండ్ నుంచి ఉత్తరప్రదేశ్, నేపాల్ సరిహద్దు, బిహార్, పశ్చిమ బెంగాల్ మీదుగా అస్సాం వరకు విస్తరించిన పచ్చిక మైదానాల్లో పిగ్మీ హాగ్‌లు కనిపించేవి. ప్రస్తుతం అస్సాంలోని మానస్ జాతీయ పార్కు పరిసరాలకే పరిమితమైంది. గడ్డితో గూడు నిర్మించుకోవడం పిగ్మీ హాగ్ ప్రత్యేక లక్షణం. పొడవైన గడ్డిని ఒకచోట చేర్చి, పైభాగాన్ని కప్పి, చిన్న ప్రవేశ మార్గంతో గూడు తయారు చేసుకుంటుంది. పిల్లలకు జన్మనిచ్చే సమయంలో ఆడ పిగ్మీ హాగ్ మరింత సురక్షితమైన గూడును నిర్మిస్తుంది. గడ్డి వేర్లు, లేత మొలకలు, దుంపలు, పండ్లు, గింజలతోపాటు పురుగులు, చీమలు, వానపాములు, కీటకాల లార్వాలను కూడా తింటాయి. ముక్కుతో నేలను కెలికి ఆహారాన్ని వెతుకుతాయి. ఈ చర్యతో నేల మెత్తబడి, గాలి–నీరు లోపలికి ప్రవేశిస్తాయి. విత్తనాలు మొలకెత్తడానికి అనుకూల పరిస్థితులు ఏర్పడతాయి. ఆడ పిగ్మీ హాగ్ ఒక కాన్పులో సాధారణంగా మూడు నుంచి ఆరు పిల్లలకు జన్మనిస్తుంది. జీవితకాలం సుమారు 8 –10 సంవత్సరాలు. రక్షిత సంరక్షణ కేంద్రాల్లో పిగ్మీ హాగ్‌లు 12 సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువకాలం జీవించగలవు.

1960ల నాటికి ఈ జంతువు పూర్తిగా అంతరించి పోయిందని భావించారు. అయితే 1971లో అస్సాంలోని ఒక పచ్చిక ప్రాంతంలో మంటలు చెలరేగినప్పుడు, అక్కడి నుంచి బయటకు పరుగెత్తిన కొన్ని పిగ్మీ హాగ్‌లు కనిపించాయి. ఈ సంఘటనతో ఆ జాతి ఇంకా జీవించి ఉందని ప్రపంచానికి తెలిసింది. వ్యవసాయ విస్తరణ, మానవ నివాసాలు, పశువుల అధిక మేత, గడ్డి కోత, పచ్చిక మైదానాలను విచక్షణా రహితంగా కాల్చడం, వేట, వరద నియంత్రణ నిర్మాణాలు, పెంపుడు పందుల నుంచి వ్యాపించే వ్యాధులు దీని మనుగడకు ప్రధాన ముప్పులుగా మారాయి. పిగ్మీ హాగ్‌ను కాపాడేందుకు 1990లలో ప్రత్యేక సంరక్షణ–సంతానోత్పత్తి కార్యక్రమాన్ని ప్రారంభించారు. 2024 అక్టోబరు నాటికి అస్సాంలోని నాలుగు రక్షిత ప్రాంతాల్లో మొత్తం 179 పిగ్మీ హాగ్‌లను తిరిగి అడవిలో ప్రవేశపెట్టారు. IUCN పిగ్మీ హాగ్‌ను ‘అంతరించిపోయే ప్రమాదంలో ఉన్న జాతి’గా గుర్తించింది. భారత వన్యప్రాణి సంరక్షణ చట్టం కింద దీనికి అత్యున్నత రక్షణ కల్పించారు. ప్రకృతిలో ఏ జీవీ అల్పమైనది కాదని, అతి చిన్న జీవి మనుగడ కూడా పర్యావరణ వ్యవస్థతో ముడిపడి ఉంటుందని పిగ్మీ హాగ్ మనకు గుర్తుచేస్తోంది.

– సచిన్ కోత్వాల్
m : 97010 01036

కథ

# సింహం - ఏనుగు



అనగనగా ఒక అడవి ఉండేది. ఆ అడవికి రాజు సింహం. ఆ సింహానికి చాలా కోపం. దానికి మంత్రి ఏనుగు. ఏనుగు చాలా మృదుస్వభావం కలది. ఏ జంతువు వచ్చి ఏమి సమస్య చెప్పినా చాలా ఓపికగా వినేది, పరిష్కారం కూడా చెప్పేది. అందుకే అన్ని జంతువులకు ఏనుగు అంటే చాలా ఇష్టం. ఏనుగు ఎన్నోసార్లు అడవిలోని రాజైన సింహానికి నచ్చజెప్పింది. "రాజా! కోపాన్ని తగ్గించుకోండి. కోపం వల్ల అన్ని జంతువులు మిమ్మల్ని చూసి భయపడుతున్నాయి. కాబట్టి మీరు కోపాన్ని తగ్గించుకుంటే మంచిది" అని ఎంతో హితవు చెప్పింది. కానీ సింహం ఆ మాటలు వినలేదు.

ఒకరోజు ఏనుగుకి ఆరోగ్యం బాగాలేదు. అడవిలోని అన్ని జంతువులు వచ్చి ఏనుగును పరామర్శించాయి. త్వరగా నయం కావాలని దేవుణ్ణి ప్రార్థించాయి. వాళ్ళ ప్రార్థనలతో చాలా తొందరగా నయమయ్యింది. ఇది ఇలా ఉండగా కొద్ది రోజుల తర్వాత సింహానికి జబ్బు చేసింది. కేవలం మంత్రి అయిన ఏనుగు మాత్రమే సింహం దగ్గరికి వచ్చి, "రాజా ఎలా ఉంది?" అని అడిగింది. కానీ అడవిలోని ఏ ఒక్క జంతువు కూడా సింహాన్ని పరామర్శించడానికి రాలేదు.

అప్పుడు సింహానికి చాలా బాధ అనిపించింది. "మంత్రివైన నీకు అన్ని జంతువులు వచ్చి పరామర్శించాయి. కానీ రాజైన నన్ను పరామర్శించడానికి ఒక్క జంతువు కూడా రాలేదు" అని చాలా బాధపడింది. అప్పుడు ఏనుగు, "రాజా! మీ కోపమే వీటన్నింటికీ కారణము" అని తెలియజెప్పింది. "కోపంతో మీరు ఏ ఒక్క జంతువును కూడా పట్టించుకోలేదు. ఏదైనా చెప్పడానికి వచ్చినప్పుడు వాటిపై కోపగించుకున్నారు. అందువలనే మీ దగ్గరికి రావడానికి భయపడుతున్నాయి. మీ కోపాన్ని తగ్గించుకోండి" అని చెప్పింది. అప్పుడు సింహం అది నిజమే అని భావించి, తన కోపాన్ని తగ్గించుకొని అప్పటి నుండి అన్ని జంతువులతో కలిసిమెలిసి ఉండసాగింది.

- చిందం అన్నపూర్ణ

టి.జి.టి. (తెలుగు), తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, చింతకుంట, కరీంనగర్.

m : 9328314771

## బాలసాహిత్య కృషికి అరుదైన గౌరవం



చాంద్ సితారే బాలసాహిత్య పురస్కారం-2026 అందుకున్న 'బాలచెలిమి' కన్వీనర్ గరిపెల్లి అశోక్ గారికి హృదయపూర్వక అభినందనలు. బాలసాహిత్యానికి ఆయన అందిస్తున్న విశిష్ట సేవలు మరింత విస్తరించాలని మనసారా ఆకాంక్షిస్తున్నాం.

- సంపాదకులు, బాలచెలిమి

**పదాల మేడ 5 సమాధానాలు (పేజి 16):**

**అడ్డం :** 1) ముడుపు, 3) మిణుగురు, 4) కరం, 5) చీకటి, 7) అన్న. 8) ఎరక్కపోయి

**నిలువు :** 1) ముప్పై ఒకటి, 2) పున్నమి, 6) అణువు, 9) ఐ, 10) పెరుగు, 11) చీర, 12) పోక, 13) ఎకరం

చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ
హైదరాబాద్ (Regd. 720/1982)

# బాలచెలిమి గ్రంథాలయం

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఒడిపిలవంచ,
కాటారం మండలం, జయశంకర్ భూపాలపల్లి జిల్లా

## బాలచెలిమి గ్రంథాలయం - పఠనాసక్తికి కొత్త వెలుగు

జయశంకర్ భూపాలపల్లి జిల్లా, కాటారం మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఒడిపిలవంచలో విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించి, వారి సృజనాత్మక ప్రతిభను వెలికితీసే లక్ష్యంతో 'బాలచెలిమి గ్రంథాలయం' ఏర్పాటు చేశారు. శ్రీ మణికొండ వేదకుమార్ సంకల్పంతో కొనసాగుతున్న బాలచెలిమి గ్రంథాలయోద్యమంలో భాగంగా ఏర్పాటైన ఈ గ్రంథాలయం, గ్రామీణ విద్యార్థుల మేధో వికాసానికి బలమైన పునాది వేస్తోంది. పాఠశాల ప్రధాన గ్రంథాలయంలో వేలాది పుస్తకాలు అందుబాటులో ఉన్నప్పటికీ, విద్యార్థులు బాలచెలిమి గ్రంథాలయంలోని పుస్తకాలను ఎంతో ఆసక్తిగా చదువుతున్నారు. ఇందులో బాల సాహిత్యం, కథలు, విజ్ఞానం, వినోదం, వ్యక్తిత్వ వికాసం, సృజనాత్మక రచనలకు సంబంధించిన పుస్తకాలు అధికంగా ఉన్నాయి. సరళమైన భాష, ఆసక్తికరమైన కథనాలు, ఆకర్షణీయమైన చిత్రాలు విద్యార్థులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. పుస్తకాలు చదవడానికే పరిమితం కాకుండా, వాటి స్ఫూర్తితో విద్యార్థులు స్వయంగా కథలు రాయడం ప్రారంభించడం ఈ గ్రంథాలయం సాధించిన ముఖ్యమైన ఫలితం. పిల్లల కోసం పిల్లలు రాసిన కథలు, ప్రముఖ రచయితలు రచించిన బాలసాహిత్య పుస్తకాలు వారిలో రచనాసక్తిని రేకెత్తిస్తున్నాయి. గ్రంథాలయ ఏర్పాటుకు మార్గదర్శకత్వం అందించిన శ్రీ గరిపెల్లి అశోక్, గ్రంథాలయ ఇన్‌చార్జి శ్రీ నల్లగొండ సురేష్ విద్యార్థులకు కథలు చదివించడం, వాటిపై చర్చలు నిర్వహించడం, రచనలో శిక్షణ ఇవ్వడం ద్వారా వారిని బాల రచయితలుగా తీర్చిదిద్దుతున్నారు. మా పాఠశాల గ్రంథాలయంలో వేల పుస్తకాలు ఉన్నప్పటికీ, విద్యార్థులు బాలచెలిమి పుస్తకాలను ఎక్కువగా చదువుతున్నారు. రాష్ట్రంలోని అనేక పాఠశాలలకు విలువైన పుస్తకాలను అందిస్తున్న దాతలకు శతకోటి వందనాలు - **శ్రీ వంగ లక్ష్మయ్య,** ప్రధానోపాధ్యాయులు.

బాలచెలిమి పుస్తకాలు విద్యార్థుల పఠనాసక్తిని పెంచడమే కాకుండా, వారిని రచనలు చేసే దిశగా ప్రేరేపిస్తున్నాయి. ఇటువంటి గ్రంథాలయం మా పాఠశాలలో ఏర్పాటవడం



విద్యార్థులకు లభించిన అదృష్టం. వారు పుస్తకాలు చదివి, ఉపాధ్యాయుల శిక్షణతో స్వయంగా కథలు రాయడం ఎంతో సంతోషకరం- **డా. కామారపు మధు,** ఉపాధ్యాయులు

వివిధ పాఠశాలల విద్యార్థులు రాసిన కథలు చదివిన తరువాత నాకు ఎంతో ఆనందం కలిగింది. అప్పటి నుంచి నేను, నా తోటి విద్యార్థులు ప్రతిరోజూ బాలచెలిమి పుస్తకాలను చదువుతున్నాం. ఇంకా ఇటువంటి పుస్తకాలు రావాలని కోరుకుంటున్నాం - **సంగెం లలిత,** ఎనిమిదో తరగతి విద్యార్థిని.

బాలచెలిమి కథల పుస్తకాలు చదవడం వల్ల నాకు కూడా కథలు రాయాలనే కోరిక కలిగింది. చిన్న కథలు రాయడం ప్రారంభించాను. మా తెలుగు ఉపాధ్యాయులు అందిస్తున్న శిక్షణ, ప్రోత్సాహంతో ఇప్పుడు కథలు రాయగలుగుతున్నాను - **వి. నాగేష్,** తొమ్మిదో తరగతి విద్యార్థి.

బాలచెలిమి గ్రంథాలయం పుస్తకాలను భద్రపరిచే ప్రదేశంగా మాత్రమే కాకుండా, విద్యార్థుల్లో పఠనం, ఆలోచన, చర్చ, రచనలను ప్రోత్సహించే సృజనాత్మక వేదికగా నిలుస్తోంది. ఇటువంటి గ్రంథాలయాలను మరిన్ని గ్రామీణ పాఠశాలలకు విస్తరించడం ద్వారా అనేకమంది విద్యార్థులను మంచి పాఠకులుగా, సృజనాత్మక రచయితలుగా తీర్చిదిద్దవచ్చు.

**- నల్లగొండ సురేష్**
జి.ప.ఉ.పా. ఒడిపిలవంచ, మం.కాటారం,
జి. జయశంకర్ భూపాలపల్లి
m: 78936 36501

## 'చిగురు' కథల పుస్తకావిష్కరణ

తెలంగాణ భాషా దినోత్సవం సందర్భంగా బ(క్రిచెప్యాల పాఠశాల విద్యార్థులు రచించిన 'చిగురు' కథల పుస్తకాన్ని ఐతా చంద్రయ్య ఆవిష్కరించారు. బాలసాహిత్యం సమసమాజ నిర్మాణానికి దోహదపడుతుందని పేర్కొని, సంపాదకుడు వరుకోలు లక్ష్మయ్య కృషిని అభినందించారు. పలువురు కవులు పాల్గొన్నారు.


## 'కలమే మా బలం' పుస్తకావిష్కరణ

పోతుగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల కథలు, కవితలతో రూపొందించిన 'కలమే మా బలం' పుస్తకాన్ని సర్పంచ్ యాదమ్మ శ్రీనివాస్, ఎంఈఓ అంబటి రవీందర్ ఆవిష్కరించారు. చిన్నారుల సృజనాత్మకతను పెంపొందించిన గరిపెల్లి అశోక్, ఉపాధ్యాయుడు శీలం రమేష్‌ను అందరూ అభినందించారు.

## బాలసాహిత్య పురస్కారం - 2026

సిరిసిల్ల అర్బన్ రగుడులోని రంగినేని ట్రస్ట్‌లో రేగులపాటి లక్ష్మీ బాలసాహిత్య పురస్కార ప్రదానోత్సవం నిర్వహించారు. రంగినేని నవీన్‌కుమార్‌రావు అధ్యక్షతన 60 మంది బాలసాహితీవేత్తలు పాల్గొన్నారు.

2024, 2025, 2026 సంవత్సరాల పురస్కారాలను అకెళ్ల వెంకట సుబ్బలక్ష్మి, ఎడ్ల లక్ష్మి,డాక్టర్ సిరికి అందజేశారు. పత్తిపాక మోహన్ బాలల కార్యశాలల ప్రాముఖ్యతను వివరించారు. 'బాలచెలిమి' సంపాదకులు మణికొండ వేదకుమార్ పిల్లల పఠనాసక్తి, సృజనాత్మకత పెంపొందిస్తూ కథా పుస్తకాల ప్రచురణకు చేస్తున్న విశేష కృషిని అభినందించారు.



## పాత్ర చిన్నదైనా... నటన మహోన్నతం

# గుమ్మడి వెంకటేశ్వరరావు

తెలుగు చలనచిత్ర రంగంలో సహజమైన నటన, గంభీరమైన స్వరం, హుందాతనం కలిగిన వ్యక్తిత్వంతో ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన మహానటుడు గుమ్మడి వెంకటేశ్వరరావు. తండ్రిగా, గురువుగా, న్యాయమూర్తిగా, మంత్రిగా, జమీందారుగా, పౌరాణిక పాత్రధారిగా–ఏ పాత్రలో నటించినా దానికి జీవం పోయడం ఆయన ప్రత్యేకత. దాదాపు ఐదు వందల చిత్రాల్లో నటించిన గుమ్మడి, తెలుగు సినిమా గర్వించదగిన ఉత్తమ పాత్రధారుల్లో ఒకరిగా గుర్తింపు పొందారు.

గుమ్మడి వెంకటేశ్వరరావు 1926 జూలై 9న ప్రస్తుత ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా రావికంపాడు గ్రామంలో జన్మించారు. గ్రామీణ వాతావరణంలో పెరిగిన ఆయనకు చిన్నతనం నుంచే నాటకాలు, సాహిత్యం, కళలంటే ఎంతో ఆసక్తి. పాఠశాల దశలోనే నాటకాల్లో నటించడం ప్రారంభించారు. రంగస్థలంపై పొందిన అనుభవం ఆయనలో ఆత్మవిశ్వాసాన్ని పెంచడంతోపాటు సంభాషణలు పలికే తీరు, హావభావాల ప్రదర్శన, పాత్ర స్వభావాన్ని అర్థం చేసుకునే సామర్థ్యాన్ని మెరుగుపరిచింది. నాటక రంగంలో సాధించిన గుర్తింపే ఆయనను చలనచిత్ర రంగం వైపు నడిపించింది.



1950లో విడుదలైన ‘అదృష్టదీపుడు’ చిత్రంతో గుమ్మడి సినీప్రస్థానం ప్రారంభమైంది. ఆరంభంలో చిన్న పాత్రలు లభించినప్పటికీ, తన సహజ నటనతో దర్శకులు, నిర్మాతల దృష్టిని ఆకర్షించారు. ‘తోడుదొంగలు’ చిత్రంలోని నటన ఆయనకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చింది. అనంతరం ‘కన్యాశుల్కం’, ‘అర్ధాంగి’, ‘మిస్సమ్మ’, ‘మాయాబజార్’, ‘జయభేరి’, ‘ఇల్లరికం’, ‘కులగోత్రాలు’, ‘మహామంత్రి తిమ్మరుసు’ వంటి అనేక విజయవంతమైన చిత్రాల్లో కీలక పాత్రలు పోషించారు.

‘మాయాబజార్’లో బలరాముడిగా ఆయన ప్రదర్శించిన గాంభీర్యం, ‘మహామంత్రి తిమ్మరుసు’లో కనబరిచిన రాజనీతి చాతుర్యం, త్యాగం, స్వామిభక్తి ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ‘అంతస్తులు’, ‘జ్యోతి’, ‘మరో మలుపు’, ‘నెలవంక’, ‘పెళ్లిపుస్తకం’ తదితర చిత్రాల్లో విభిన్న మనస్తత్వాలు కలిగిన పాత్రలను ఎంతో పరిణతితో పోషించారు. వయసులో తనకంటే పెద్దవారి పాత్రలను కూడా చిన్న వయసులోనే నమ్మదగిన విధంగా అభినయించడం ఆయన ప్రతిభకు నిదర్శనం.

నాయకుడి పాత్రకే ప్రాధాన్యం ఉన్న కాలంలో సహాయ, కుటుంబ, సామాజిక పాత్రలకు గౌరవాన్ని తీసుకొచ్చిన నటుడు గుమ్మడి. పాత్ర చిన్నదా, పెద్దదా అని కాకుండా, కథలో దాని ప్రాముఖ్యాన్ని గుర్తించి నటించేవారు. అతిశయోక్తి లేని హావభావాలు, స్పష్టమైన సంభాషణలు, కళ్లతోనే భావాలను పలికించే నైపుణ్యం ఆయన నటనలో కనిపించేవి. తెరపైనే కాకుండా వ్యక్తిగత జీవితంలోనూ క్రమశిక్షణ, నిరాడంబరత, సమయపాలన పాటించేవారని సినీరంగ ప్రముఖులు ప్రశంసించేవారు.

భారతీయ చలనచిత్ర రంగానికి అందించిన విశిష్ట సేవలకు భారత ప్రభుత్వం 1977లో ఆయనను ‘పద్మశ్రీ’ పురస్కారంతో సత్కరించింది. ‘మహామంత్రి తిమ్మరుసు’ చిత్రంలోని నటనకు రాష్ట్రపతి పురస్కారం లభించింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రఘుపతి వెంకయ్య పురస్కారంతో గౌరవించింది. జాతీయ చలనచిత్ర పురస్కారాల న్యాయనిర్ణేతగా కూడా ఆయన సేవలందించారు.

‘జగద్గురు శ్రీ కాశీనాయన చరిత్ర’ ఆయన చివరి చిత్రం. కొంతకాలం అనారోగ్యంతో బాధపడిన గుమ్మడి 2010 జనవరి 26న హైదరాబాద్‌లో కన్నుమూశారు. ఆయన భౌతికంగా దూరమైనప్పటికీ, పోషించిన పాత్రలు తెలుగు ప్రజల జ్ఞాపకాల్లో సజీవంగా నిలిచాయి. సహజ నటనకు, సంస్కారవంతమైన వ్యక్తిత్వానికి గుమ్మడి వెంకటేశ్వరరావు నిత్యస్ఫూర్తి.

– సువేగా

# CENTRAL® BOOKS

SINCE 1947

**Your trusted Academic Partner - Then, Now & Forever**

## DIAMOND JUBILEE

**CELEBRATING 75 YEARS OF KNOWLEDGE, TRUST & LEADERSHIP**



| 12 lakhs + Customers | 700+ Schools | 15 Business Awards | Online Services | Library Solutions & Cambridge Assesment | Books and Stationery Supplies |
|---|---|---|---|---|---|

## CBS HUB PRIVATE LIMITED

**Head Office :** Head Office : Hans Tech Park Building, 5th Floor, Kondapur, Hyderabad - 500 084.

Regd. Office : Central Book Shop #5-9-186, Chapel Road, Abids, Hyderabad.

Warehouses: Plot No. P9/20, Sy. No. 81, IDA, Nacharam, Uppal Mandal, Medchal, Malkajgiri Dist.
Plot No: 1/5B, TSIIC Industrial Development Area, Nacharam, Medchal Dist., Hyderabad.

www.centralbooks.in


Printed at : Deccan Press, Azamabad, Hyderabad-20, Ph : 90599 50055

BALA CHELIMI, Telugu Children's Monthly Magazine
Date of Publication: 23rd Every Month
Postal Dates: 24th & 26th Every Month
Posting at BPC IV, Patrika Channel, Nampally, Hyderabad-500001.

PRGI Regn. No. 52828/1992, TC No. TELTEL01232
Postal Regn.No.HCD-5022/2024-2026



# బాల చెలిమి
పిల్లల వికాస పత్రిక
## ప్రచురణలు



**46 పుస్తకాల ధర రూ.2320 • తగ్గింపు ధర రూ. 2100**

## తెలంగాణ బడి పిల్లల కథలు
10 పుస్తకాల సెట్ ధర రూ.330 తగ్గింపు ధర రూ. 300



## పెద్దలు రాసిన పిల్లల కథలు (ఉమ్మడి పది జిల్లాలు)
10 పుస్తకాల సెట్ ధర రూ.350 • తగ్గింపు ధర రూ. 300



## చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రచురించిన ఇతర పుస్తకాలు
18 పుస్తకాల ధర రూ.950 • తగ్గింపు ధర రూ. 850



పిల్లలకు అత్యంత ఆనందానిచ్చేది ఆట బొమ్మలు, కథల పుస్తకాలే. పాఠ్యపుస్తకాలు అందించే జ్ఞానానికి సమాంతరంగా మరెంతో లోకజ్ఞానాన్ని అందించేది బాల సాహిత్యమే. పుస్తకాలు పిల్లల ఆలోచనా నైపుణ్యాలను పెంచుతాయి. వారి ఊహలకు ప్రాణం పోస్తాయి. వారిలో సృజనాత్మకతను పెంచుతాయి. చరిత్ర, సంస్కృతి, కళలు, సైన్స్, మానవ స్వభావాలు, జంతు స్వభావాలు, ఆరోగ్య సంబంధిత అంశాలు - ఒకటేమిటి ప్రాథమిక విజ్ఞానఖని బాలసాహిత్యం, పిల్లలో నైతికతను, ఆధ్యాత్మికతను, సక్రమమైన ప్రవర్తనను, మంచి చెడుల అవగాహనను పెంచే బాధ్యతను బాలసాహిత్యమే నెరవేర్చగలదు.

-మణికొండ వేదకుమార్
చైర్మన్, చిల్డ్రన్స్ ఎడ్యుకేషన్ అకాడమీ

**చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ**
హైదరాబాద్ (Regd. 720/1982)

**Account Details :**
Account Name : Bala Chelimi
Bank Name : Canara Bank
A/c. No. : 30101010003714
Branch : Ashoknagar, Hyderabad.
IFSC Code : CNRB0013010

**ప్రతులకు**
అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు. మరియు
'భూపతి సదన్' 3-6-716, స్ట్రీట్ నెం.12,
హిమాయత్‌నగర్, హైదరాబాద్-500029
ఫోన్ : 9030 6262 88

SCAN & PAY

email: edit.chelimi@gmail.com website : www.balachelimi.com

Printed at : Deccan Press, Azamabad, Hyderabad-20, Ph : 90599 50055

Edited, printed, published and owned by Manikonda Vedakumar,
Printed at Deccan Press, H.No.1-9-1126/B, Azamabad, Musheerabad, Hyderabad-500020, Telangana State.
Published at "CHANDRAM", # 3-6-712/2, 12th Street, Himayatnagar, Hyderabad-500029, Telangana.
Editor: Manikonda Vedakumar. RNI Reg No. 52828/92, Tc No: TEL Tel01232.
Cell : 9030626288, Mail ID : edit.chelimi@gmail.com